UNIVERSAL LIBRARY
OU_204890
UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T82/R25M Accession No. T2028

Author రవీంద్రనాథ్ ఠాకూర్

Title ముక్తధార

This book should be returned on or before the date last marked below.

# ముక్తధార

గ్రంథకర్త:

శ్రీ రవీంద్రనాథ ఠాకూరు.

అనువాదకుడు:

కొప్పర్తి నారాయణమూర్తి, బి. ఏ., యల్. టి.,

సాహితీ సమితి, బెజవాడ.

ప్రకాశకుఁడు:

జి. జానకి రామయ్య,

బెజవాడ.

బెజవాడ: ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాలయందు

క. కోదండరామయ్యగారిచే ముద్రింపఁబడియె.

1929.

సర్వస్వామ్య సంకలితము.] [వెల [redacted]

DEDICATED

WITH KIND PERMISSION

TO

C. R. REDDY Esq., M. A.,

Vice-Chancellor of

THE ANDHRA UNIVERSITY

as a Token of

High esteem for his erudition.

# పీఠిక.

కవిసార్వభౌముఁడు రవీంద్రుఁడు "ముక్తధార"ను జనమాతృభాష యగు వంగభాషయందు మొట్టమొదట రచించెను. ఆతనిచే స్వయముగా నాంగ్లేయమున కవతరింపఁబడిన, యేతన్నాటకము 1922 వ సంవత్సరమున మెయినెలలో వెలువడిన 'మోడరన్ రివ్యూ' సంచికలోఁ బ్రచురింపఁబడుటఁ జూచి దానిం జదివి యందలి రసపోషణమునకును, పాత్రౌచిత్యమునకును, భావగాంభీర్యమునకును, తత్త్వబోధమునకును మిక్కిలి యానందించి, యిట్టి గ్రంథరాజము తెనిఁగింపఁబడిన నెంతో బాగుండునని తలఁచి, వెంటనే నేనాగ్రంథము నాంధ్రీకరించుట కనుమతి యొసంగఁ గవిసార్వభౌముని వేఁడుచు నాతనికి జాబు వ్రాసితిని. ఉదారస్వభావుఁడగు నమ్మహనీయుఁడు వెంటనె నా కనుమతి ననుగ్రహించినందు లకాతనికి నా కృతజ్ఞతాపూర్వక వందనముల నర్పించుచున్నాను.

దీని నాంధ్రీకరించుటలో నాంగ్లేయ గ్రంథమునే ముఖ్యముగా ననుసరించినను, ఇందలి పాటలను వ్రాయునప్పుడును అక్కడక్కడ సందేహములు గలిగినప్పుడును భావవైశద్యము కొఱకును వంగమాతృక సాహాయ్యమును బొందితిని. మఱి యాంధ్రీకరణ మెట్లున్నను, అందలి భాష యెట్లున్నను వస్తువు

శ్రేష్ఠమైన దగుటచే నీగ్రంథ మాంధ్రుల యాదరమునకుఁ బాత్రమగునని నమ్ముచున్నాను.

ప్రమాద వశమునను, అజ్ఞానవశమునను ఇందు దోష ములు బడియుండ వచ్చును. సహృదయులగు పాఠక మహాశ యులు వాని నెఱింగించిన పునర్ముద్రణమున సవరింతును.

దీని నాంధ్రీకరించుటలో నుచితరీతులు చూపి దోష ములు సవరించి, నా యీ సంకల్పమును నెరవేర్చుటలో నా తోఁబాటు శ్రమపడిన మదీయ మిత్రులగు శ్రీ చింతా దీక్షి తులు గారును, శ్రీ రూపనగుడి నారాయణరావు గారును మిక్కిలి ప్రశంసనీయులు. అందులో మొదటివారీ పొత్త మున కుచితమైన యుపోద్ఘాతము వ్రాసి నా కృతజ్ఞతకుఁ బాత్రులైరి.

—అనువాదకుడు.

# డాక్టరు రవీంద్రనాథఠాకూరు వ్రాసిన సూచిక.

ముక్తధారా నామాంకిత మీ నాటకము. ముక్తధార యన స్వేచ్ఛగా ప్రవహించు ఝరము. ఈనాటకము గూఢార్థ ప్రతిపాదక మనియు, మానవ జీవితమున స్వేచ్ఛయను పద మెంత యభిప్రాయసూచకమో యంతయు నిది తెలియ జేయుననియు ఏతన్నామమువలన పాఠకులకుఁ దోచవచ్చును. యంత్రము వారిప్రవాహము నడ్డగించుచున్నదను విషయ మీ యభిప్రాయమును ధృఢపరచుచున్నది.

ఈ నాటక రచనమందు గూఢార్థమున కవకాశమున్న దన్న మాట వాస్తవమె. అట్లూహించుటవలన తప్పులేదు. కాని మనశ్శాస్త్రము నందొక సిద్ధాంతమునకు నిదర్శనముగ దీని నెంచవలెనని పాఠకులను నేను కోరుచున్నాను.

ఈ నాటకమందు వచ్చు ప్రధాన పాత్రలలో నొక రగు అభిజిత్తు తాను ముక్తధార యొద్ద దొరకిన శిశు వనుసంగతిని దెలిసికొనెను. ఇట్టుండు నని తా నెన్నడు తలంపని యీ విషయము ఆతని హృదయమును కలవరపరచెను. ఆతని జీవితమునకును వారిపాతమునకును ఆధ్యాత్మిక సంబంధ మున్నట్లును, ఆతఁడు జన్మించినపుడు సందేశ పూర్వకముగ నాతని నాహ్వానించిన ప్రథమకంఠధ్వని దానిదే యనియు, అతడు నమ్మెను. తత్క్షణము నుండియు అభివృద్ధి నాశించు మానవున

తత్సూచకములగు పథకముల రచించుటయును సందేశ నిర్వహణ మాతని జీవితోద్దేశ మయినది. ఇప్పుడే యూస్థాని శిల్పియగు 'విభూతి' తనయంత్రముతో ముక్తధారా ప్రవాహము నడ్డగించిన, వార్త ఆతని వీనుల బడెను. తన్ను ధిక్కరించుటగా నాతఁడు కార్యము నెంచుకొనెను. తన యంత్రజీవితము వారిధారా ప్రవాతరూపమునె దాల్చిన ట్లాతఁ డెంచెను. ఉత్తరకూటాధీశుఁడు ఈ యంత్ర సహాయమున తన రాజకీయాశయమును నెరవేర్చుటకు పూనుకొనె నన్న కారణముచే రాజవాసమును అందు తనకున్న బాధ్యతను ఆతఁడు గుర్తింపలేఁడు. ఆత్మవిముక్తి కవి నిరోధము కల్పించు నని ఆతని దృఢమైన నమ్మకము. అంతరాత్మకు అహితమైన కార్యముల తన్ను బొనుపుచు తన యాత్మయొక్క స్వేచ్ఛనడ్డు యంత్రమునుగా వానిని భావించెను. రాజవాసము నతఁడు నిరాకరించెను, బంధింపఁబడిన జలములకును తన జీవితమునకును ఒకేమారు స్వేచ్ఛను కలుగఁ జేయుటకై వెడలి వచ్చెను. ఉత్కృష్టమగు ఆత్మ పరిత్యాగమునుఁ జేసి యాతఁడు తన మనోభీష్టమును నెఱ వేర్చుకొనెను.

# FOREWORD.

It gives me the greatest pleasure to write this brief foreword to this excellent Telugu Translation of a great play by Dr. Rabindra Nath Tagore. I regard the invitation by the author to me to write it, as a command from the presiding genius of the New Literature of India. I have been long yearning for that happy day when a new self-awareness, a new self-reverence, and a new self-realisation will surge through the country from end to end, like the puissant and persuasive energy of the spring waking the world to warmth and fragrance and to glory of blossom and abundance of fruit. I have always felt that our spirit must be free from fetters before the shakles will fall off from our hands and feet. When Vasudeva was in prison the handcuffs were on and the prison-gate was closed bolted and locked. But when Sree Krishna was born, the hand cuffs fell off and the doors of the prison-gate flew open and even the the swollen river parted its waters to make a way for God. It is only the liberation of the soul by the grace of God that can bring all other forms of liberation. That is why India must come into her own in the realm of the ideal before she can come into her own in the realm of the real Art is her looking-glass just as religion is

her elixir of life. Let her drink this elixir of life and become young and radieat again, and let her look at her devine loveliness in the mirror of art. Who will then deny such a queen the throne, which is her birthright ?

I have known my friend Mr. Satyanarayana, for some years and know him as one who is Indian to the core while being Andhra to his finger-tips. Unless each of us learns to be an incarnation of the whole, andthenyearnsand tries to purify and ennoble our particular fragment of Indian soil and Indian society, India will be the arena of dissensions and not the home of love and the temple of holiness. I am glad that he has gone for inspiration (for every loving translation is really a translation from a lower to a higher plane of thought and emotion) to the Poet Laureate of Asia, the poet-saint who is Indian to the core, Bengali to the finger-tips and universal in his love and in his appeal.

What a blessed name is Muktha-dhara, The Liberated Current! It is itself expressive of the new renaissance in India, symbolic of the new life now coursing through India's frame and soul. The liberation of the life-giving waters has always haunted the heart of India from the Vedic times. The story of Indra & Vritra in the Rigveda is the ancient parallel of Tagore's modern drama of Muktha

Dhara. What glorious poetry and prophecy cling round the Vedic story ! What glorious poetry and prophecy cling round Tagore's play !

I should not try to interpose my interpretation of the play and its glorious message between the readers heart and the author's work. But I am unable to resist the temptation altogether, though I shall curb it. The message of the play is the ancient yet eternal message of the Isavasya Upanishad (of which Tagore is so fond as readers of *personality* know well): Tina Tyaktina Bhunjeethah (Enjoy through renunciation). Man must rise above himself to realise and attain the divine in himself. He must transmute the lead of desire into the gold of love by the alchemic touch of renunciation. The self-sacrifice of the leaders for the sake of the ideal results in a newer and higher idealism and a newer & higher realisation by the people. The machine of Bibhuti's make in Uttarakut stands not merely for the bloated and murderous industrialism and nationalism and militarism of to-day, but also for everything that is Tamasic, that is Assuric, that is opposed to the laws of God. Tagore hits with his shafts of scornful ridicule that selfishness which is not satishfied with poisoning the minds and the hearts of the citizens with egoisms and callous hatreds, but seeks to turn education into a means of poisoning the minds of the young who are to be the

citizens of to-morrow. Tagore has sought in his play to expose the hollowness of the Nietzchean theory of the superman and the supernation and the super-state. All through his life Tagore has sought, like the Crown Prince Abhijit in the play, to open out paths for the adventurous spirit of man, and to free the imprisoned current of the spiritual energies of man.

The central lesson of the great drama is what has been well stated by Tagore in his Sadhana; "O, Worker of the Universe! We would pray to Thee to let the irresistible current of Thy universal energy come like the impetuous south-wind of spring, let it come over the vast field of the life of man, let it bring the scent of many flowers. the murmerings of many woodlands, let it make sweet and vocal the lifelessness of our dried up soul life. Let us on our newly awakened powers cry out for unlimited fulfilment in leaf and flower and fruit .... Man's abiding happiness is not in getting anything but in giving himself up to what is greater than himself, to ideas which are larger than his individual life, the idea of his country, of humanity, of God."

I must stop here though unwillingiy. Mr. Satyanarayana's translation is eqnally fine and faithful, and wherever a translation is fired by the spirit of the original and is by a deft crafts-man it rises to the dignity of a creative work of art. I wish the

author every success, and what is more than success, that passion of delight which the creation of ideal beauty brings and which finds its fulfilment not in mere fame which is but a fancied life in others, fleeting breath, but in yet ampler and more glorious creation.

I cannot better conclude this all-too-brief foreword than by quoting the beautiful and haunting and passionate song sung again and again throught the play to Lord Bhairava who is the Divine Realisor of Bliss in Renunciation and who gives unto all His devotees the power of Renunciation and the realisation of Bliss,

Jaya Bhairava, Jaya Shankara,
Jaya, Jaya, Jaya, Pralayankara,
Shankara, Shankara!
Jaya Samsaya Bhedana,
Jaya Bandhana Chedana,
Jaya Sankata Samhara,
Shankara, Shankara.

Negapatam,
13–9–1923

K. S. Ramaswami Sastri,
Sub Judge,(Negapatam).

---

# ఉపోద్ఘాతము.

---

రవీంద్రనాథుఁడు నూతనముగ రచియించిన నాటకము ముక్తధార. ఈకవీంద్రుఁడు రచియించిన యితరనాటకములందును కావ్యములందును వలెనే యిందును కొంతవఱకు కంఠరాగము స్ఫురించుచున్నది. మానవుని స్వేచ్ఛకు నిరోధముఁ గల్పించుచున్న యంత్రచిహ్నితమగు కృత్రిమనాగరకత శాశ్వతము గాదు అని.

మానవులయెడ సౌభ్రాత్రము వహించుటయే నిజమగు దేశభక్తి. సహజమగు స్వేచ్ఛకు నిరోధము కల్గినపుడు మానవసౌభ్రాత్రము నంగీకరించిన మానవుఁ డావిరోధముఁ దొలఁగించుటకు తన్నయిన నిచ్చును.

రవీంద్రుఁడు వంగదేశమున జన్మించిన మహాకవి. దేశభక్తుఁడు. లోకమందెల్ల నసాధారణప్రతిభాశాలి యని మన్ననలఁ బడసిన మాన్యుఁడు. శ్రీమంతుల యింటఁబుట్టి మహర్షి యని కొనియాడఁబడిన దేవేంద్రనాథుని ప్రియతనయుఁడై పిన్ననాటనుండియు వాణీకృపాకటాక్షవీక్షణ మందుచు నామె కనుసన్నల మెలంగుచు, తన దేశమునకుఁ గీర్తిఁగడించిన దేశభక్తుఁడు.

ప్రాక్సంచితవిజ్ఞాన మీతనియందు మూర్తీభవించినది. ఈతనివంశము విద్యలవంశము. సంగీతము, సాహిత్యము, చిత్రకళలు వీరియింట నెల్లవేళల కొలువుదీరి యుండును.

ఇట్టి వంశమున జన్మించిన యీఘనుఁడు కవితాసామ్రాజ్య పట్టభద్రుఁడై లోకమువారందఱికిఁ దనసందేశము నందఁజేయుచు, వారలఁ దనకవిత్వమున నోలలాడించుచు, తనవిజ్ఞానకిరణముల నన్నిదిక్కులకుఁ బ్రసరింపఁజేయు రవీంద్రుఁడై మెలఁగుచున్నాఁడు.

ఈతనికవిత్వ మీశ్వరరహస్యబోధకము; భక్తిపూరితము. మనవారు తత్త్వములని పాడెడు పాటలకును ఈతని పద్యములకును ఒక్కింతపోలిక

కలదు. కాని రవీంద్రునిపద్యములందువలె నీతత్త్వకీర్తనములందుఁ గవిత్వ వైభవము లేదు.

రవీంద్రుఁడు కవి, నాటకకర్త, కథకుఁడు, విమర్శకుఁడు, జ్ఞాని, తత్త్వోపదేశి.

ఈతనికవిత్వము మృదుపదలలితము, భావగర్భితము, భక్తిరసపూరితము; జనుల తాపమును మాన్పగల్గినది, ఉత్సాహమును బురిఁగొల్పఁ గల్గినది, ఆశల నంకురింపఁ జేయునది.

ఈతనికథ లాదర్శప్రాయములు. భరతఖండవాసుల కష్టసుఖములఁ బ్రతిబింబించును. మానవహృదయముల విప్పిచూపును.

ఈతనిబోధనలు నిరుత్సాహవంతుల కాశలఁ బుట్టించును. నూతన సందేశములఁ జూపును. అవాఙ్మానసగోచరు నుగ్గడించుచు, నొక్కమారు సగుణుఁ గొనియాడుచు, వేఱొక్కమారు భగవంతుఁడు భర్తగాను, భక్తుఁడు భార్యగాను, భగవంతుఁడు ప్రకృతిగాను, భక్తుఁడు ప్రకృతిసౌందర్యమునకుఁ బారవశ్యముఁజెందు కవిగాను చిత్రించుచు, నింకొకమారు యీతఁడు గీతములఁ బాడుచుండును. ఉపనిషత్తుల సార మీకవితాశ్రీల ననుభవింప వచ్చును.

ప్రపంచమందెల్ల పేరెన్నికఁగన్న కవివరేణ్యున కిచ్చు నోబెల్ పారితోషిక మీకవిఁ బొందినపుడే యీతనికీర్తిలతిక దేశదేశముల వ్యాపించినది. లోకమున కీతఁ డర్పించిన తొలిపాత్రము గీతాంజలి, గీతములరూపముగ భగవంతుని కీకవి యంజలి నొసంగినాఁడు. దీనిని తొలుత వంగభాషను రచించి, పిమ్మట నాంగ్లభాషకు కవియే మార్చి లోకమున కర్పించెను. అందలి కవితారసముఁగ్రోలి లోకము వ్యామోహ మందినది. దేశభక్తుఁడు మాతృభాషాపోషకుఁడు నగు నీకవి తనగ్రంథముల నన్నింటిఁ దొలుదొల్త వంగభాషయందే రచియించి తర్వాత నొక్కొక్కటి లోకోపకారార్థమై యింగ్లీషు భాషాద్వారమున లోకమున కొసంగుచుండె. ఈతని గ్రంథములు పలుభా

షలఁ జేరినవి. అట్లే తెనుఁగుభాషనుగూడ చేరినవి. గీతాంజలి యను పద్యములు; చిత్ర, అచలాయతనము అనురూపకములు; వినోదిని, రాజర్షి యను నవలలు మున్నగున వాంధ్రీకరింపఁ బడినవి. రవీంద్రుని కథలు కొన్నియు, చంద్రవంకనుండి శిశుగీతములు కొన్నియును, కొన్నివ్యాసములును తెనుఁగుదుస్తులను దాల్చినవి. ఆంధ్ర, కృష్ణా, సాహితీపత్రికాపాఠకులు రవీంద్రుని పరిచయ మందినవారే. ప్రస్తుతము దేశభాషలం దున్నతస్థానమును వహించిన వంగభాష తెనుఁగువారి నాకర్షించినది. తత్కారణమున పలువు రాంధ్రు లుత్తమ గ్రంథములను వంగభాషనుండి తెనుఁగులోనికి మార్చుచున్నారు. ఆంధ్రకవిత్వము నేఁడు రవీంద్రునిధోరణి నంటిపోవుట శుభసూచకమే.

భాషాభిమానులచే తెనుఁగువారి కర్పింపఁబడిన కవిసార్వభౌమునిగీతములను నాటకములను కథలను వ్యాసాదులను తెనుఁగువారు తనివిదీర ననుభవించి కృతార్థులగుదురు గాక. పరదేశములందున్న యుత్సాహము రవీంద్రుని పుస్తకములఁ జదువుటలో తెలుఁగువారికి లేకుండుటకుఁ గారణమేమో? తెనుఁగుదేశమునందు జనసామాన్య మింకను రవీంద్రుని యౌత్కృష్ట్యమును గ్రహింపకపోయినను ఆంగ్లవిద్యాధికులుమాత్ర మది గుర్తెఱుంగుట ప్రశంసాపాత్రము.

రవీంద్రుఁ డనేకనాటకరాజముల విరచించెను. ముక్తధార యందొకటి.

రవీంద్రుని నాటకములు నేఁడు మనము తెనుఁగుభాషలోఁ జూచునాటకములఁ బోలియుండవు. ఇందు భావము ప్రధానము. అంతర్లక్ష్య ముండును. పాత్రముల కున్నతాదర్శములఁ బ్రదర్శించుచుండును. సభ్యులకు నవ్వుపుట్టింపవలయుననియుఁ, సభ్యుల మెప్పుఁబడయవలయుననియు, పద్యములను పాటలను వీలు దప్పిన సంభాషణములను గల్గు నాటకము లెక్కడ? ఔచిత్యప్రధానములగు రవీంద్రనాథునిరూపకము లెక్కడ? కాళిదాసుని నాటకము ప్రదర్శించినఁ గాంచవచ్చువారు తక్కువ. నీతిబాహ్యములగు నాట

కములఁ జూడ నరుదెంచువారు తండోపతండము. నాటకరంగము సంగీతసభగా మార్చిన ప్రేక్షకుల కానందము. కథాసందర్భ మెట్లున్నను సరియే. ఇట్టిస్థితి మారకున్న తెలుఁగువారి యభిరుచులు పాడగును.

జనసామాన్యమున కిష్టమున్నను లేకున్నను, నాటకసంఘములవారు శ్రేష్ఠనాటకములనే ప్రదర్శింప వలెను. అట్లుచేయుచు రాఁగా రాఁగా ప్రజ లెట్టి నాటకములు మంచివో, ఎట్టివి చెడ్డవో గ్రహింపఁ గలుగుదురు.

రవీంద్రనాథుని నాటకములను బాహాటముగా తెలుఁగువారు ప్రదర్శించుచు ప్రేక్షకుల కుత్తమ నాటకములపై నభిరుచిఁ గల్గింతురు గాక. కాళిదాసాద్యుత్తమకవుల నాటకమార్గముల పునరుద్ధరించెను రవీంద్రుఁడు, ప్రాచీనమార్గములందు గొప్పమార్పులఁ గల్పింపలేదు.

రవీంద్రనాథుని రూపకప్రదర్శనమునకు, సీను లత్యల్పము. ముక్తధారా నాటకమంతయు భైరవాలయప్రాంతముననే కొనసాగినది.

రంగుగుడ్డలతోఁ ప్రేక్షకుల నలరింపఁ జూచుటకంటె భావౌన్నత్యముచేఁ ప్రేక్షకుల మనముల నుద్ధరింప నెంచుట యొప్పుగదా!

ప్రాచీననాటకములు ప్రదర్శించుటకు విలువయైన సాక లనవసరములు. ధనికులును బీదవారును యెల్లరును ఆనందింప దగినట్లు విశాలముగ బయళ్ళ ప్రదర్శింపఁదగు. అట్లు పూర్వులు ప్రదర్శించువారుకూడ సీనులు, తెఁగబొద్దులు, రకరకముల అవసరములు—ఇట్టి తంతు నిరుపయోగము. నేటినాటకములను ధనికులుమాత్రమే యానందింతురు. ప్రాచీనకాలమున నాటకముల నందరు నానందించు చుండిరి. నేఁడు నాటకశాలలు కొంతవరకు రోగములఁ గలిగించు చున్నవి. పూర్వ మిట్టిచిక్కులు లేవు.

నాటకము సంఘమున కుపకారిగా నుండవలెనన్న నయ్యది జనసామాన్యమున కందుఁబాటులో నుండవలెను. పూర్వ మట్లుండెను. నేఁ డట్లులేదు.

తత్కారణముననే ప్రజల నుత్తమమార్గములకుఁ ద్రిప్పుటకు నాటకము లోక సాధనముగ నుండుటకు మాఱుగ ప్రజలనుండి పైకమును వసూలుచేయు సాధనములయినవి. పట్టి పై మెఱుఁగులతో ప్రేక్షకుల కన్నులకును చెవులకును క్షణభంగురమగు నుత్సాహమొసంగి హృదయమున కెంతమాత్రము సమీపింపలేకున్న వీ నాటకములు.

రవీంద్రుని నాటకములుఁగూడ ప్రాచీననాటకముల ఫక్కినే బయళ్ళ యందును మంటపములందును ప్రదర్శింప నుద్దేశింపఁబడినట్లు తోచుచున్నది. అందువలననే ఈకవి సీనులను గురించి నియమములు చేయలేదు. రంగముల మార్పు లేదు.

కొన్ని పాత్రములను నాటకరంగమున ప్రవేశపెట్టి యుపన్యసింప జేసి నంతమాత్రమున నాటకమనిపించుకొనదు. కొందఱుకవుల చేతులలో నాటక పాత్రలు పట్టి కీలుబొమ్మలయి పోయినవి అవి సజీవములు కావు. దేవతలు, ఉత్తమనాయకులు, ప్రాకృతజనులు ఒక్కరీతిగఁ బ్రసంగింతురు. ప్రసంగాదులయం దౌచిత్యము తక్కువ.

కవినిర్మించు పాత్రలు రెండువిధములుగా నుండవచ్చును. బ్రహ్మ సృజించిన మానవులనే సజీవులుగా నుంచి తన నాటకముల వారినిఁ జొప్పించి వారు జగన్నాటకమున నెట్లు మెలఁగుదురో అట్లే కవి నాటకమందుఁగూడ మెలంగునట్లు చేయుట. ఇందుప్రకృతిని కవి యనుకరించును. జగమున మానవు లేయేసందర్భములం దేయే విధములుగా మెలంగుదురో యెట్టి చిత్తవృత్తులఁ జూపుదురో ఆరీతినే యిందును మెలఁగుదురు. కవి యిచ్చో బ్రహ్మసృష్టి ననుకరించుచున్నాడు. జగమను పెద్దగ్రంథమును జాగరూకుఁడై పఠించి తాను కొన్నియుత్తమాంశములను నాటకములందు జొనుపును. ఎట్టిసందర్భములు చిత్రితములగుట కర్హములో ఎట్టివి కావో కవియే నిర్ణయించును. తాను చూచుచున్న లోకమును తనసృష్టులందు బ్రతిబింబింపఁ జేయుట యాతని యభిలాష.

రెండవరీతిపాత్రలు మానవాతీతములు. ఆదర్శప్రాయములు. ప్రతిభాశాలియగు కవి లోకమున గాంచు మానవు లందలి లోపముల గుర్తెఱిగి వారెట్లున్న పరిపూర్ణదశ నందుదురో అట్టివారల తనకృతులందు చిత్రించును. ఇట్లు చిత్రితము లగు పాత్రలను మనము సాధారణముగ లోకమున జూడము. చూడ గన్నను వారిని మెచ్చుకొని, వారివలె నుండగోరుదుము. శ్రీరామ హరిశ్చంద్రు లిట్టివారు. ఇట్టివారి లోకానుభవము కూడ సాధారణ మానవుల యనుభవములకు భిన్నమై యుండును.

రవీంద్రనాథుడు తన రూపకము లందు చిత్రించిన పాత్రలు రెండు విధములుగా నున్నవి. ముక్తధారలో చిత్రింప బడిన అభిజిత్తు, ధనంజయుడు ఇట్టివారు. ఇట్టిపాత్రలనే గాక సాధారణ మానవులను గూడ రవీంద్రుడు చిత్రించు చుండును. ముక్తధారలో అంబ మాతృప్రేమ వెల్లడించును. సంజయుడు సందేహములమధ్య చిక్కుకొనియు, బడిపంతులు కడుపు కక్కుర్తిచే రాజభక్తి కీర్తనలను బాలురకు బోధించియు-సాధారణ మానవత్వమును వెల్లడించుచున్నారు. సామాన్య మానవులు నాటకమున పాత్రలైనచో జనసామాన్యము నాటకముల నానందింతురు. మానవాతీతులను కూడ చిత్రించిన రవీంద్రుని నాటకరాజములు పండిత పామర హృద్యములై యుండు ననుట నిర్వివాదాంశము.

రవీంద్రుడు చిత్రించిన పాత్రలు నాటకములం దెక్కువగ రాజులు, ధనవంతులు, సాధారణులు గూడ గలరు. రవీంద్రుడు తనకథలందు హీనజాతులపై నభిమానము జూపును. ధనికులను బీదవారును గూడ రవీంద్రుని సృష్టిలో గలరు. వారి కష్టసుఖములు, లోపాలోపములు, జీవితయాత్రలు వర్ణింపబడినవి.

ఈనాటి కొన్ని తెనుగు నవలలందు తెనుగు దుస్తులను తెనుగు నామములను ధరించిన విజాతీయులు ఆంధ్రులవలె మెలంగ నుంకించు చున్నారు. వేషమును మార్చినంత మాత్రమున హృదయము, ఆచారములు

మారవు. గనుక వారు పట్టుబడిపోవుచున్నారు. సవరసులను యూహాములు గను జాన్ స్మిత్తులను వీర సింహ ప్రతాప సింహులుగను గారు మార్చినంత మాత్రమున ఇంగ్లీషు గ్రంథము లాంధ్రగ్రంథము లగునా?

రవీంద్రుడు సృజించిన వారందరు భారతీయులే.

కావ్య నిర్మాణ మొక చిత్రకళయని పండితుల యభిప్రాయము. కవన ముల్లంట కవికి సహజము. అట్టి కవనమున నీతి యుండిన నుండును. లేకున్న మానును. నీతి నుపదేశింప వలెనను నూహతో కవి కావ్యములను వ్రాయ రాదు. నీతికిని, చిత్రకళకును సంబంధము లేదు. కావ్యమునకు కళాప్రాశస్త్య మందున్న నీతివల్ల రాదు. అం దంతర్లీనమై యున్న సౌందర్యము వల్ల వచ్చును. అని కొంద రందురు.

కావ్యముల యుద్దేశ్యము కన్నులకును చెవులకును ఇంపు గలుగ జేయు టయే కాదు. మానవుల నుద్ధరించుట కూడనై యున్నది. నీతిని బోధింపని కావ్యములు తావి లేని పూవు లని కొందరందురు.

రవీంద్రుని కావ్యములందును నాటకములందును నట్టి పసుచుంచు కళా సౌందర్యముతో పాటు హృదయమును శోధించు నీతులు ఆదర్శములు కూడ మిళితము లైయున్నవి.

## ‘ముక్తధార’ యందలి కథ.

బర్లిను విశ్వవిద్యాలయమునం దుపాధ్యాయులుగ నున్నవారును రవీంద్రుని గ్రంథములను జర్మనుభాషకు మార్చుచున్నవారు నగు, డాక్టరు హార్ మట్ వాన్ గ్లాసినాపుగారు ముక్తధారను గూర్చి వ్రాసిన యంశములు సమంజసముగా నుండుటచే వాని నిందుఁ బొందుపరచుచున్నాను.

ఈ నాటకముపేరు ముక్తధార. అనగా స్వేచ్ఛగా ప్రవహించు ఏఱు. ఇదియొక గొప్ప జలపాతమునకుఁ బెట్టిన గూఢార్థప్రబోధకమగు నామము. నాటక ప్రదర్శన మంతయు దీని నాశ్రయించి యుండును. నాటకమున కాధారభూతమైన కథ యేమన:—

రణజిత్తు ఉత్తరకూటము నేలుచుండెను. విభూతి యందాస్థాన శిల్పి. ఇరువదియైదు సంవత్సరములు కష్టపడి ముక్తధారాజలము నరికట్టగల్గు నొక కట్ట నాతఁడిప్పుడే నిర్మించినాఁడు. ముక్తధారాజలములు శివతారకు ప్రవహించుటకు వీలులేకుండ శివతారా పురవాసులు ఉత్తర కూటాధిపతి పరిపాలనమునం దుండిరి. తఱచు వారలు కుట్రలు పన్నుచు తిరుగబాటు చేయుచునుండువారు.

ముక్తధారా జలముల నడ్డి వేసినచో శివతారాపురవాసులను విధేయులనుగాఁ జేయ వచ్చునని రణజిత్తు ఊహ. జలముల నరికట్టిన యంత్రముల నిర్మాణము ముగిసినది. అందుచే ఉత్సవము జరుగ నున్నది. ముక్తధారకు సమీపమున భైరవాలయము గలదు. ఆ దినముననే ప్రారంభోత్సవము జరుగ నున్నది. భక్తులు భైరవ గీతములఁ బాడుచుండగా నాటక రంగమున పెక్కుమంది ప్రవేశించి, శిల్పియగు విభూతిని గూర్చియు, అతని యంత్రమును గూర్చియు తమ తమ యభిప్రాయముల వెలిబుత్తురు. కొందఱతని గొప్ప మేధావి యని పొగడుచు యంత్రమును గూర్చి గీతములఁ బాడుదురు. కొందఱతని తృణీకరించుచు ఆనకట్టను నిర్మించుతరి ప్రాణములఁ గోల్పోయిన అసంఖ్యాకులగు మానవుల గతికి వాపోవుదురు. రాజుగారి యింట వాసము చేయు కొందఱు నీరముల నాపిన శివతారావాసు లమితకష్టముల పాలౌదురు, గాన తద్ప్రయత్నముల కొనసాగింపవలదని అతనికి బోధింతురు. కాని వీరి మాటలను లెక్కపెట్టువారు లేరైరి. శివతార వాసులు పెక్కురు, వైరాగియగు ధనంజయుని నాయకత్వమున రాజును జూడవత్తురు. వీరి ప్రయత్నములుగూడ నిష్ఫలమైనవి.

అభిజిత్తు యువరాజు. ఇతఁడే యుత్తర కూటాధీశుని ప్రక్కలో బల్లెమైనాఁడు. ఈ యువకుఁడు దూరదృష్టి గలవాఁడు. మానవహితుఁడు. ఉత్తర కూట రాష్ట్రము రాజకీయాధిక్యత నొందుటకై శివతారాపురవాసుల నందరిని బలి పెట్టుట యావసరమను మాట యాతనికి గిట్టదు.

రణజిత్తు తన కుమారుఁడును యువరాజును అగు అభిజిత్తును శివతారకు పంపెను. అతఁడచ్చట రాజప్రతినిధిగా నున్న దినములలో తన రాష్ట్ర

ము వారి హితమునకు గాక శివతారా వాస్తవ్యుల హితముకొరకై పనిచేయువాఁడు. ఇట్లు చేయుట వాణిజ్యము బాగుగా జరుగుటకై నదిలోయలో ఇరుకులో మూయబడిన బాట నాతఁడు తెరిపించెను.

అతని పరిపాలనా కాలమున రాకపోకలకు వసతు లేర్పడెను. ఇవి క్షామ పీడితులగు శివతారా ప్రజలకు మిక్కిలి యుపయోగకరములై యైనను పాలకులగు ఉత్తరకూట రాష్ట్ర ప్రజలకు ఆర్థిక నష్టమును కలుగఁ జేయుచుండెను.

యంత్రరాజు యొక్క కృషిని నిర్మూలము సేయుటకై అభిజిత్తు ప్రతిజ్ఞ పూనుట కుద్దేశము మానవ సేవయే కాదు. ఇందు కొంత నిగూఢార్థము కలదు. యువరాజు తాను నిజముగా రణజిత్తుకుమారుడు కాదని ఒక తఱి తెలిసికొనెను. తాను శిశువుగా నున్నప్పుడు ముక్తధారా వారిపాతము కడ రాజాతని కనుగొనినట్లును పిమ్మట దత్తము చేసికొన్నట్లును తెలిసికొనెను. తన దేహముపై ప్రపంచము నేలు చక్రవర్తి కుండు సాముద్రిక చిహ్నము లుండుటచే తాను పెద్దవాఁడయిన పిమ్మట ప్రపంచము నేల గలఁడను దురాశ నాతఁడు పెంచుకొనెను.

తా నానదికి కుమారుఁడని యువరాజు తలంచుచుండెను. వారిపాత మెప్పుడును అతని నాకర్షించుచుండెను. తనకును జలపాతమునకును సన్నిహితాధ్యాత్మిక సంబంధ మున్నట్లాతఁడు నమ్మెను. ముక్తధారా ప్రవాహమే యాతని జననమునకు కారణమని యాతని నమ్మకము. కావుననే, ముక్తధారా ప్రవాహశక్తి మానవు లందఱు ననుభవించునట్లు చేయుట యాతని విద్యుక్త ధర్మమని యాతఁడు తలచెను.

రణజిత్తుయొక్క యుక్తివు ప్రకారము అభిజిత్తు బంధితుఁడయ్యెను. అతని శిక్షించిన నాతఁడు ఋజుమార్గవర్తి యగునని రాజు తలంచెను. ఉత్తరకూట పౌరులు కొందఱు యువరాజును నిందింతురు. ఉత్తరకూటవాసుల కహితముగ శివతారా వాసుల పక్షమవలంబించినందులకు మఱికొందఱాతని

విముక్తి గోరుదురు. చివరకు అతఁడున్న యిల్లంటుకొనెను. ఉగ్ర కూట వాసులు చేయవలెనని చేసిన పనియే యిది. ఈ విధముగా నభిజిత్తు స్వేచ్ఛను పొందెను. తాను చేయవలెనని నిర్ధారణ చేసికొన్న కార్యమును గొనసాగించు కొనుటకై యాతఁడు వెడలెను.

ఎవ్వరును చూడకుండ నాతఁడు కట్టవెంగనున్న యంత్రము లందు ప్రవేశించెను. యంత్రపు మీటను త్రిప్పెను. జలము తీవ్రముగా ప్రవహించెను. తత్కారణమున యంత్రము నిర్మూల మయ్యెను. యువరాజు కూడ వీరకులోచిత కార్య మొనరించి ప్రాణముల గోల్పోయెను. తనకు చావు వచ్చునని యాతఁ డెఱింగినదే. జలపాత ప్రవాహమునకు స్వేచ్ఛను కల్పించుటలో నాతఁడు తనస్వేచ్ఛను గూడ పొందెను! తనతల్లియగు రక్తధార గర్భమున నాతఁడు జొచ్చెను!

నాటక మందలి నిగూఢార్థము తెలిసికొనుటకు యువరాజగు అభిజిత్తు మరణము తోడ్పడుచున్నది. తన్ను మరచి తన వారిని మరచి లోకము కొరకే పాటుపడువారలు మాత్రమే మానవుల పురోభివృద్ధికి తోడ్పడ గలరు. మానవలోకమునకు నాయకత్వము వహించువారు ఐహిక సుఖముల త్యజింపవలెను. ప్రాణమును సయితము ఆదర్శప్రాప్తికై సమర్పింప వలెను. జాతీయత యని పేరు బెట్టుకొని, పరుల బాధించుచు అస్థిరములగు రాజకీయ విజయముల నందుచు నున్న వారికిని మానవులందరును సహోదరులే యెన్న వారికిని గల యభిప్రాయ భేదములు ఈ నాటకమున విస్పష్టముగ పంశావుల చూపఁబడినవి.

విద్యార్థులతో గూడ నాటకరంగమున ప్రవేశించు ఉపాధ్యాయుడు కృత్రిమదేశ భక్తికి ఉదాహరణముగ నున్నాడు. రణజిత్తుపై నార్భాటముగ స్తోత్ర గీతముల బాలురచే నితఁడు చదివించును. ఇట్లు చేసిన జీతము హెచ్చుచేయుదురని అత. శివతరాపుర వాసులపై పట్టరాని యసహ్యత నీతఁడు బాలురకు నూరి పోసెను. వారి మతము చెడ్డదఁట; వారి మొక్కులు

ఉత్తర కూటపువారి నాసికలంత వంకర తిరిగి యుండ లేదట. తత్కారణమున వారు తక్కువ వారట! ఉత్తరకూట రాష్ట్రమునకు ప్రపంచ సామ్రాజ్యమును దక్కించుటయే చరిత్రోద్దేశమని ఉత్సాహముతో నీతడు బాలురకు బోధించును. అన్నివిధముల నీతడు శక్తిహీనుల నణచి పెట్టుట రణజిత్తు కుటుంబమువారికి దైవ నిర్ణీతమగు హక్కని యాతని యూహ.

ఇందులకు ప్రతికూలాభిప్రాయమును విరాగియగు ధనంజయుడు వ్యక్త పరచును. అతని యుపదేశములు జయప్రదములు కాలేదు. ప్రజలు వానిని బాగుగ గ్రహించలేదు. చెడుగు నణంపవలెనన్న దాని ననుభవింపవలయును. అప్పుడది తనంతట తానె నాశమందును. ప్రతిక్రియవలన అనగా అపకారమున కపకార మొనర్చి ధిక్కరించుటవలన క్రొత్త యపకారములు కలుగుటకు మార్గ మేర్పడును.

ధనంజయునకును నేటి నాయకుడగు గాంధి మహాత్మున కొకింత పోలిక గలదు. కాని ఈ నాటక కర్తయగు రవీంద్రుడు యీ విరాగిని యాతని యుపదేశములను 15 వత్సరములకు ముందు వ్రాసిన ప్రాయశ్చిత్తమను నాటకమునందు చిత్రించినట్లు వ్రాయుచున్నాడు.

రవీంద్రుని యీ నాటకము పవిత్రమైన యుపదేశములతోను అధ్యాత్మికార్థముతోను విలసిల్లుచున్నది. నాటక మంతయు వచనము. అందందు గీతము లున్నవి.

ఇప్పటి రాజకీయ స్థితిలో భారతీయులచే నీ నాటక మాదరింపబడ గలదు. నాటక రంగమున నియ్యది యెంతవరకు జయప్రదముగ నుండగలదో భావికాలము నిర్ణయింప వలెను.”

బళ్ళారి,
26—2—23.

చింతా దీక్షితులు, బి. ఏ. ఎల్. టి.
సాహితీసమితిసభ్యుడు

BOMBAY,

Dec. 5, 1922.

Dear Sir,

You have the Poet's permission to translate Muktadhara into Telugu.

*Yours very truly,*

C. F. ANDREWS.

---

(True Copy)

# ముక్తధార

[స్థలము. పర్వతప్రదేశము; అందు భైరవాలయమునకుఁ బోవు బాట గలదు. బాట కొంతమువరకు స్థల మిదియే.]

గొప్ప యినుప యంత్రము యొక్క యూర్ధ్వభాగము వెనుకతట్టున సూచింపఁబడి యున్నది; దీని కెదురుగఁ ద్రిశూలమును శిఖరముగాఁ గల భైరవాలయ గోపురమున్నది: బాటప్రక్క మామిడితోఁపులో నుత్తరకూట రాజగు రణజిత్తు తన రాచగుడారమును వేసికొనెను. ఆయన నాఁడు సాయంకాలపు టుత్సవమును జరుపుటకు బోవుచు మార్గమున నిచ్చట విశ్రాంతి గొనుచుండెను. ఇరువది యైదు వత్సరము లుత్కృష్టప్రయాసఁ జెందితుదకు, తన యాస్థానశిల్పియగు విభూతి ముక్తధార యను జలపతనమున కడ్డుగ నొక గట్టును గట్టఁజాలెను.

ఈ త్తరకూట నగరవాసులు వారి వారి కానుకలతో నాలయమును దర్శించుచున్నారు. ఆస్థాన శిల్పియగు విభూతి నిర్వహించిన కార్యమును గొనియాడుటకయి యాయుత్సవము నాలయ ప్రాకారములలోఁ జరుప సంసిద్ధులగుచున్నారు.

ఆలయమునందలి భైరవార్చకు లెదుటనే యున్నారు. వారు ధూతాను పాణముగ దేవాలయమునకై శ్రేణిగట్టి పలుమారు ప్రదక్షిణము గావించు

చున్నారు. వారు భైరవసంకీర్తనం జేయుచుండఁ గొందరు హారతులఁ ద్రిప్పుచున్నారు కొందఱు జయఘంటలఁ బ్రయోగించుచున్నారు. కొందఱు శంఖారావములఁ జేయుచున్నారు.

### గేయము.

జయ భైరవ జయ శంకర
జయ జయ జయ ప్రళయంకర
శంకర శంకర
జయ సంశయ భేదన
జయ బంధన ఛేదన
జయ సంకట సంహార
శంకర శంకర

[వారు లోనఁ బ్రవేశింతురు.]

[అన్యదేశస్థుఁ డొకఁడు వ్యాపారద్రవ్యములతో వచ్చుచు నుత్తరకూటవాసుని గలిసికొనును.

అన్యదేశీయుడు:—అచ్చట నంబరమునకై సమర్పఁబడిన దేమి? ఎంతభయంకరముగానున్నదీ!

ఉత్తరకూటవాసుడు:—నీ వెఱుఁగవా? ఓహో, నీవన్యదేశీయుఁడవు—అది యంత్రము.

అన్య:—యంత్రమా! ఏమి యంత్రము?

ఉత్తర:—గతించిన యిరువదియైదు సంవత్సరములనుండియు దీని నిర్మాణమునకయి యాస్థాన శిల్పియగు విభూతి పాటుబడుచుండెను. ఇప్పటికది ముగిసెను. తత్కార్యగౌరవార్థ మిప్పు డుత్సవము జరుగుచున్నది.

అన్య:—ఈయంత్ర నిర్మాణోద్దేశ మేమై యుండును?

ఉత్తర:—ముక్తధారా జలపాతము నియ్యది కట్టివేసెను.

అన్య:—ఎంత పెనుభూతము! మాంస రహితమై వ్రేలాడు గోడలుగల కరాళ విషోరగము భాతి నున్నది! తన్నిరంత రావలోకనమున నీ ప్రాణము కృశించి నశించును.

ఉత్తర:—మా ప్రాణముల కొఱకు నీ వేమియు భయపడ నవసరము లేదు. కాయగాచిన యీ శరీరములు మా యుసుపుల గాపాడఁగలవు లే,

అన్య:—సరేకాని, సూర్యచంద్రాదుల యెదుట దిగంబరముగాఁ బ్రదర్శింపఁదగిన వస్తువు కాదిది. దీని దుర్నివేశము వలన నాకాశ మంతయు నెట్లు కలఁతఁ జెందినట్లున్నదో నీకు గోచరించుట లేదా?

ఉత్తర:—కాని, నేఁటి సాయంకాలమున జరుగు భైరవపూజకు నీవరుగవా?

అన్య:—అరుగ కేమి! అందుకొఱకే నే నిటకు వచ్చియుంట. ప్రతి వత్సరము నీ కాలములో కానుకలఁ దీసికొనివచ్చుచుందును. కాని, యాకసమున కష్టముగ నిట్టి భయంకర నిర్మాణముంట, నేనెన్నఁడును జూచియుండలేదు. దేవాలయ గోపురము కంటెను దీని నెత్తుగఁ బోనిచ్చుట దైవాపరాధ మని నీవు దలంపవా?

(నిష్క్రమించును)

[నేలపై ధూళిలో జీరాడు తెల్లని ముసుంగు ఆపాదమస్తకము గప్పు అంబ యను నామె ప్రవేశము]

అంబ:—సుమనా! నా తనయా! నా పుత్త్రుఁడు సుమనుఁడు నాకడకు మరలి రాఁడా? మీ రందఱు మరలి వచ్చితిరి; వాఁ డెక్కడ?

ఉత్తర:—ఎవ్వతె వీవు?

అంబ:—జనాయిగ్రామవాసిని యగు నంబ యనుదానను; సుమనుఁడు నా తనయుఁడు; నా నయనానందదాయి. నా ప్రాణమునకుఁ బ్రాణము—హా, నా సుమనా!

ఉత్తర:—వాని కేమి సంభవించెను?

అంబ:—వాని నెచ్చటకుఁ గొంపోయిరో నే నెఱుఁగ. భైరవ పూజార్థ మాలయములోని కేగియుంటి. నే మరలివచ్చి చూచుసరికి వాఁడు గొనిపోఁబడియుండెను.

ఉత్తర:—కట్టను గట్టు పనికై యతనిఁ జేకొని యుండవలయు.

అంబ:—ఈ మార్గముగుండ గౌరీ శైలమునకు పశ్చిమముగ గొనిపోయిరని వింటిని. అంత దూరమునకు నాదృష్టి యానదు. శైలమును దాఁటియుండుదారి నే జూడలేను.

ఉత్తర:—శోకించుట వలనఁ బ్రయోజన మేమి? మేమాలయమున కేగుచున్నాము. మాకిది పండుగదినము. నీవు గూడ రావలసినదే.

అంబ:—రాను, నే రాను! నా సుతునిఁ గోల్పోయిన నాఁటి నుండియు నాలయమునకుఁ బోవ వెఱచుచున్నాను.

చెప్పెద వినుము; మాపూజ లాతనిఁ జేరవు. గర్భాలయ మును జేరుటకు ముందె ఎవఁడో వానిని దస్కరించును.

ఉత్తర:—ఎవఁ డా తస్కరుఁడు ?

అంబ:—నా యొద్దనుండి నా సుమనునిఁ దీసికొనిపోయినవాఁడే! వాఁ డెవఁడో నాకుఁ దెలియదు. సుమనా! నాసుమనా! నాకూనా !!

[వాయ నిష్క్రమించును.]

[విభూతి దేవాలయమునకుఁ బోవుచుండ దారిలో యువరాజగు నభిజిత్తు పంపిన వార్తావహుఁ డాతని గలిసికొనును.]

వార్తా:—విభూతీ! యువరాజు నన్ను నీ యొద్దకుఁ బంపి యున్నారు.

విభూతి:—ఏమి వారి సెలవు?

వార్తా:—ముక్తధారా జలపాతమున కడ్డముగ కట్టనొక దాని బహుకాలముగఁ గట్టుచుంటివి. ఎన్నియోసారు లదికూలి పోయెను. అనేకులు మంటికింద నిసుకకిందను బడిఁ యూపిరాడక చనిపోయిరి. ఇతరులు నీటిప్రవాహముచే గొట్టుకొని పోఁబడిరి. ఎట్టకేల కీ నాఁడు—

విభూతి:—నాకోరిక యీడేఱెను. వారి ప్రాణసమర్పణము సఫలీకృత మాయెను.

వార్తా:—శివతారా వాస్తవ్యుల కింకను నీ విషయ మెఱుక లేదు. దైవదత్తంబగు నీ సలిలము నెవ్వఁడును దమకుఁ గాకుండఁ జేయలేఁడనియే వారినమ్మకము.

విభూతి:— దేవుఁడు వారికి జలమునిచ్చి యున్నాఁడు; నాకు దాని నరికట్టు శక్తి నిచ్చియున్నాఁడు.

వార్తా:—పాపము! వా రెఱుఁగరు. వారము దినములలో వారిపొలములు—

విభూతి:—వారి పొలముల మాటయేల? వారిపొలములతో నాకేమిపని?

వార్తా:—నీరు లేమిచే వారిపొలముల ధ్వంసము చేయ వలెనని కదా నీ యుద్దేశము?

విభూతి:—తనకుఁ బ్రతికూలతఁగల్పించు జలశిలావాలుకలపై మానవుఁడు విజయమందునట్లు జేయుటయె నా యుద్దేశము. ఎక్కడనో యుండు నొక పాఁడుకాఁపువాని పాఁడుపొలమున కేమిసంభవించు నను యోజనతో నామనస్సును వ్యథపెట్టుట కవకాశముండలేదు.

వార్తా—ఆ విషయమై నీమనంబును వ్యథపెట్టుట కవకాశము తుదకు రానేలేదా యని యువరాజుగారు నిన్నడుగు చున్నారు.

విభూతి:—లేదు లేదు! యంత్రపు ఔన్నత్యమును గూర్చి మననము సేయుటలో నామనస్సు లీనమయియున్నది.

వార్తా:—కుడువఁ గూడులేనివారి యార్త నిర్ఘోషము లామనన మునకు భంగము దేఁజాలవా?

విభూతి:— తేఁజాలవు. జలోత్పీడన మాకట్టను తెగగొట్టలేదు. క్షుత్పీడితుల యేడుపు లా యంత్రమును గదల్పలేవు.

వార్తా:— శాపములకు నీవు భయపడవా?

విభూతి:— శాపములా?—ఉత్తర కూటమందు పనివాండ్రు దుర్లభు లయినపుడు, రాజాజ్ఞవలన చండిపత్తన గ్రామ మందలి ప్రతియింటినుండి పదునెనిమి దేండ్లు మీఱిన యువకుల నందఱి రప్పించితిని; అం దనేకులు వారిగృహంబు లకు మరలిపోలేదు. వారి తల్లుల శాప ఝంఝా మారు తముల సరకుగొనక నా యంత్రము విజయము గాంచెను. భగవంతుని శక్తితోనే పోరాడువానికి మనుజుల శాపము లన నెంత?

వార్తా:— సృష్టి సామర్థ్యమును జూపి కీర్తి నింతకుముందే పొందితివి. ఇం కిప్పుడా సృష్టిని నశింపఁజేసి యెక్కుడు కీర్తి నంద నీకు తరుణమువచ్చెనని యువరాజుగారు సెలవిచ్చు చున్నారు.

విభూతి:— సాంతమగు వఱకే అపని నాయది; ఇప్పుడు సం పూర్ణమయి యుంటచే నది యుత్తరకూట వాసుల కెల్లర కును జెందును. కాన కట్టలు బడఁగొట్టుటకు నాకిఁక స్వాతం త్ర్యము లేదు.

వార్తా:— ఆ స్వాతంత్ర్యమును తామే వహించెద మని యువరాజుగారు తెలియఁబఱచుచున్నారు.

విభూతి:—యువరాజుగారి స్వవచనములేనా యివి? ఆయన మనలోవారు కారా?

వార్తా:—ఉత్తరికూట పరిపాలన విషయమున భగవదిచ్ఛ యిట్టిదని యింకను నిర్ధారణ కావలసి యున్నదనియు; యంత్రి మడ్డముగా మధ్య నుండరాదనియు యువరాజు గారు చెప్పుచున్నారు.

విభూతి.—భగవంతునిపదవి మనదే యని యంత్రశక్తివలన ఋజువుచేయుట నా కర్తవ్యము. యంత్రి బంధమును సడలించుటకే మాత్రపు సందును విడువలేదని యువ రాజుగారితోఁ జెప్పుము.

వార్తా:—లయకారుఁడగు భగవంతుఁడు వర్తించుటకు వెడ ల్పగు బాట యవసరములేదు. మన కగోచరమగు చిన్న చిన్న రంధ్రములే ఆయనకుఁ జాలును.

విభూతి:—రంధ్రములా! వానిగూర్చి నీకేమి యెఱుక?

వార్తా:—నాకెఱుక లేదు. వాని నుపయోగించు భగవంతున కవి యెఱుక.

[వార్తావహుఁడు నిష్క్రమించును]

[ఉత్తర కూటనగర వాసులు భైరవాలయమునకుఁ బోవుచుఁ ద్రోవ లో విభూతిని గలిసికొందురు.]

మొదటిపౌరుఁడు:—యంత్రరాజా! నీవు చిత్రమయినవాఁడవు! నీవెప్పుడు మా తలదన్ని పోతివో మేము గమనించక పోతిమి!

రెండవ:—మొదటినుండి వాని కది యలవాటు! లోలోన నెట్లు ప్రయత్నించి లోకమునవిజయముగాంచుచున్నాఁడో యెవ్వరెఱుంగరు. 'బాబుయా' గ్రామ పాఠశాలలో బోడితలగల యీ విభూతి మాతోఁబాటు చెవుల నులిపించుకొనిన వాఁడే. అట్టివాడు మనలమీాఁటి యెట్టి వైచిత్ర్యముల నొనర్చెను ?

మూఁడవ:—ఏమోయి, గబ్రూ! చేతసజ్జబట్టుకొని నోరు తెఱచుకొని యిచ్చటేల నిలచి యున్నావు? విభూతిని దర్శించుట నీ కిది మొదటి సారియా? పుష్పమాలికలఁ దెమ్ము, వాని కంఠమున వేయుదము.

విభూతి:—వలదు, వలదు! అటు జేయుట వలనఁ బ్రయోజన మేమి?

మూఁడవ:—ఏల వల దనెదవు? నీకంఠము నీఘనతతో బాటు దీర్ఘమగుచుండినచో నది యొంటెమెడ వలె పొడవగును; అప్పుడు మేము దానిని హారములతో నింపెదము.

రెండవ:—మనమార్దంగికుఁడు హరీశుఁ డింకను రాలేదు.

మొదటి.—వాఁడు సోమరులలో నగ్రగణ్యుఁడు. వాని వీఁపును మృదంగముగాఁ జేసికొని దానిపైఁ గట్టిగా వాయించినఁగాని—

మూఁడవ:—ఏమి తెలివి తక్కువ! మనకంటె నెంతో బాగుగ నాతఁడు మృదంగమును వాయింపఁగలఁడు.

నాలవ:—సమంతు నడిగి రథముఁ దెచ్చి యందు విభూతిని గూర్చుండఁజేసి యాలయమునకుఁ బోవలెనని యనుకొంటిని. కాని రాజుగారే పాదచారులై యాలయమునకుఁ బోవుదురని వినికి. మనము విభూతిని భుజములపై నెక్కించుకొని పోదము.

విభూతి:—వలదు వలదు! అందుల కే నర్హుఁడఁగాను.

అయిదవ:—అటు లెంత మాత్రము కాదు! ఉత్తరకూటజన యితృయంక మున జన్మ మొందితివి. ఇప్పు డామెభుజ ములపై కెక్కింపవలసి యున్నది నిన్ను.

[అతని నెత్తుకొని, యందఱు గలిసి పాడుదురు.]

నమోయంత్ర, నమోయంత్ర, నమోయంత్ర, నమోయంత్ర!
త్వం చక్రముఖర మంద్రిత
త్వం వజ్ర వహ్ని వందిత
తవ వస్తు విశ్వ వక్షదంశ
ధ్వంస—వికటదంత!
తవదీప్త అగ్ని శతశతఘ్ని
విఘ్న విజయ పంథ
తవలోహాగళన శైల దళన
అచల—చలన మంత్ర
కదాచిత్ కాష్టలోష్ట ఇష్టక దృఢ

ఘన పినద్ధకాయా
కదాచిత్ భూతల—జల—అంతఃక్ష
లంఘన లఘుమాయా
తవఖని—ఖనిత్రి నఖ విదీర్ణ
క్షితి వికీర్ణ అంత్రి
తవ పంచభూత, బంధనకర
ఇంద్రజాల తంత్రి!

ముక్తధార.

[రణజిత్తు, మంత్రి విడిదినుండి ప్రవేశము]

రణ:—మంత్రివర్యా! మన పాలనలోనున్న శివతారయందలి జనుల నీవు బొత్తిగ వశపఱచుకొనలేకపోతివి. తుద కిప్పుడు ముక్తధారాపాతమును బంధించుటచే నద్దాని 'విభూతి' సాధ్యముగావించె. అందులకై యుత్సాహచిహ్నముల నేమియుఁజూపకున్నావేల? అసూయయా?

మంత్రి:—మహారాజా! క్షమింపుము. పాఱ, గునపము, వీనిసహాయమున మంటితోను ఱాళ్ళతోను బోరుట మన కార్యముకాదు. మన యాయుధము రాజతంత్రము. మానవ మనంబులతో మనము వ్యవహరింతుము. శివతారకు యువరాజు నంప సలహా నొసంగినవాఁడ నేన. ఈ యుపాయమువలన మనము నిర్మింపఁ గలిగియుండు కట్ట మన యెదుటఁ గాన్పించెడు కట్టకంటె నెక్కుడుగా ప్రజల యుద్రిక్తశక్తి నణఁచి తన్మూలమున శ్రేయోదాయకమును వినశ్వరమును నై యుండునుగదా!

రణ:—కాని, యటు చేయుటవలన పర్యవసాన మేమయ్యె? రెండు సంవత్సరములనుండి వారు పన్నులఁ జెల్లించుట లేదు. క్షామములు వారిని సాధారణముగఁ బీడించు

చునేయున్నవి; అయినను బూర్వ మెన్నఁడును వారు పన్నులఁ జెల్లింపకుండ నుండలేదు.

మంత్రి:—యువరాజును మరలిరమ్మని మీరుత్తరువు పాలించిన యుత్తరక్షణమునఁ బన్నులకంటె నెక్కుడు విలువగల మేలు చేకూరినది. స్వల్పముల సరకుసేయకుండ యుచితజ్ఞత కాదు. పరిస్థితులు దుర్భరములైనవు డల్పములే తద్బాధానుభవమువలన ఘనము లగును.

రణ:—చీటికి మాటికి నీ ఉపదేశ ధోరణిని మార్చుచున్నావు. ఉన్నతపదమునుండి స్థానబలముచేఁ గ్రింది వారిని పీడించుట సులభతమ మనియు, మత్పాలితులగు పరరాష్ట్రప్రజలు నిరంతర మట్టి పీడనమునకు లోనయియుండవలెనసియు పలుమారు నీవు చెప్పినమాటలు నాకు బాగుగ జ్ఞప్తియందున్నవి.

మంత్రి:—అంతేకదా? అవును, నేఁజెప్పుట వాస్తవమే కాని యిప్పటి పరిస్థితులు వేఱు. కాన నాయుపదేశము సమయోచితము. ఇప్పుడన్న—

రణ:—యువరాజును శివతారకుఁ బంపుట నాయభీష్టమునకు వ్యతిరేకమే.

మంత్రి:—అది యెట్లు స్వామీ?

రణ:—దూరము గాంభీర్యాపాదకము. అతి పరిచయము దాని క్షీణింపఁజేయును. ప్రేమచే స్వదేశస్థుల ప్రేమను

బడయునగును; అన్యదేశస్థుల భయముచే వశపఱచు కొన వలెను.

మంత్రి:—రాజా! యువరాజును శివతారకుఁ బంపిన నిజమయిన కారణమును మఱచియున్నారు. కొన్ని దినంబులుగ యువరాజునందు చిత్తసంభ్రమము గోచరించెను. అతఁడు తాను రాజవంశసంభూతుఁడు కాదనియు, ముక్తధారా మూలముసమీపమున నెచటనొ దొరకినవాఁడనియు నెటులనో తెలిసికొనెనని మనకనుమానము తట్టినది కాన వాని మనంబునకుఁ బని గల్పింప.

రణ:—అవును. నేనెఱుఁగుదును. రాత్రివేళ నొంటరిగ ముక్తధారామూలము దర్శించుటకుఁ బోవుచుండెను. నే నొకసారి హఠాత్తుగ నాతని కెదురుబడి విశేష మేమనియు తానచ్చట నుండఁ గారణ మేమనియు నడిగితిని. ఆనదీమర్మర ధ్వనియందు తన జననికంఠమును వినుచున్నానని యతఁడు బదులు పలికెను.

మంత్రి:—పలుమారు రాచనగరువీడి చనుటకుఁ గారణమేమని నేనొకసారి యాతని నడిగితిని. అందుల కాతఁడు క్రొత్త పథముల రచించుటకుఁ దా నీలోకమున నుద్భవించె ననియు, దాని నెఱవేర్చుటయే తన జీవితముయొక్క అంతరోద్దేశ మనియుఁ బలికెను.

రణ:—మహా సామ్రాజ్యమున కితఁడు చక్రవర్తి యగు నను భవిష్యవాణి యింక నమ్మదగినది కాదు.

మంత్రి:—కాని, యోదేవా! మీ గురువునకు గురువయిన వారే యీసంగతిని మీకుఁ జెప్పుటకొఱకై వచ్చియుండినది. వారే యీ జోస్యమును జెప్పిరి.

రణ:—ఆయన పొరఁబడియుండును. యువరాజు తనవివిధచిత్తవృత్తులచే నెల్లప్పుడును నాకు నష్టములను గల్గించుచున్నాఁడు. బుద్ధిజాడ్యజనితోన్మాదుఁడై మొన్న నందిలోయలోని యుద్ధగోడ నూరక నిర్మూలము గావించెను. పూర్వులెన్నియో వత్సరములు కష్టపడి చేసిన పని నీతఁడు కొలఁది రోజులలోఁ బాడుచేసెను. శివతారలోని యున్ని మొదలగు వ్యుత్పత్తులు మన రాష్ట్రమును దాఁటి పరరాష్ట్రములలో నమ్ముడుబోకుండ నిలుపుట కిప్పుడేమార్గమును లేదు. ఉత్తరకూటములో నిందుచే నాహార పదార్థముల యొక్కయు వస్త్రముల యొక్కయు ధరలు హెచ్చెను.

మంత్రి:—దేవరవారు చిత్తగింపవలెను అతఁడనుభవము లేని యువకుఁడు. శివతారయొక్క క్షేమమునే మన మునం దిడుకొని తన ధర్మమును పాక్షికదృష్టితో నెఱవేర్చుచున్నాఁడు.

రణ:—దానినే స్వదేశస్థులపైఁ దిరుగఁబాటని నే ననుచున్నాను. శివతారాపురవాసి యగు భైరాగి ధనంజయుఁ

డీవిషయమున నేదో జోక్యము గలుగఁ జేసికొని యుండ వలెను. మన పాలితులు మనపైఁ దిరుగఁబడునట్లు చేయు టయే యాతని పని. వానిరుద్రాక్షమాలతోనె యాతని గొంతు నులిమివేయ వలయు. వాని నిప్పుడే పట్టు కొన వలయు.

మంత్రి:— నే నెదురుచెప్పఁజాలను. కాని నేఁజెప్పునది మీకుఁ దెలియనిది కాదు. యుపద్రవ కారకులఁ గొందఱ నణఁచి వుచ్చుటకంటె యూరక విడుచుటయే మేలు.

రణ:— దానిఁగూర్చి నీవు ప్రయాసపడ నక్కర లేదు.

మంత్రి— దేవా! అట్లుగాదు. తామె దానిగుఱించి ప్రయాస గొన వలెనని విన్నవించుచున్నాను.

[ద్వారపాలకుఁడు ప్రవేశించు.]

ద్వా:—ప్రభూత్తమా! దేవరవారి పినతండ్రి విశ్వజిత్తు మోహనగిరినుండి వచ్చియున్నారు.

రణ:—వీఁడును ఆ గుంపులోఁ జేరినవాఁడే। యువరాజును బాడుచేయుటలో మిక్కిలి పాల్గొనినవారిలో వీఁ డగ్ర గణ్యుఁడు. బంధువయ్యు శాత్రవమును సాధించునాతఁడు గూనివానివీఁపుపైని మూఁపురము వంటి వాఁడు. ఎల్లప్పు డది వెంటనె యంటియుండును. దానిఁ గోయ వీలులేదు; మోయ నతికష్టము......ఆ ధ్వనియేమి?

మంత్రి:—భక్తాదులు కూడి యాలయమునకుఁ బ్రదక్షిణము సేయుచున్నారు.

(అర్చకులు వచ్చి మిగిలిన పాటను పాడుదురు)

తిమిర హృద్విదారణ
జ్వలదగ్ని నిదారుణ
మరు శ్మశాన సంచర
శంకర శంకర.
వజ్ర ఘోష వాణీ
రుద్రశూల పాణీ
మృత్యు సింధు సంతర
శంకర శంకర.

[వారు నిష్క్రమింతురు]

(రణజిత్తుయొక్క శిబిరమునకు విశ్వజిత్తు ప్రవేశము)

రణ:—ప్రణామము లాచరించుచున్నాఁడను. నేఁటి రాత్రి పూజా సమయమునకుఁ దా మిచ్చటకు విజయముచేసి మమ్ము ధన్యులను జేతురని మే మనుకొనలేదు.

విశ్వ:—నేఁటిరేయి మీరు భైరవస్వామికి సమర్పించు పూజల నాతఁడు పరిగ్రహింపఁడని మిమ్ముల హెచ్చరించుటకు నే వచ్చితి.

రణ:—మీ రట్లనుట యీ మహోత్సవమును దూషించుటయే.

విశ్వ:—ఉత్సవమా ? ఎందులకు? పిపాసాపీడితు లాస్వా దించు గంగను, ఈశ్వర జటాజూటమునుండి యశ్రాంతము నిర్గమించుచున్న గంగను బంధించినందులకా? సరే, దాని నేల బంధించితిరి ?

రణ:—మాశత్రువుల నోడించుటకు.

విశ్వ:—అందువలన భగవంతునితో శత్రుత్వము గల్గునని మీరు వెరచుటలేదా ?

రణ:—మాజయమే యీశ్వరుని జయము. ఆతఁడె మా యుత్తరకూటమునకుఁ బ్రధాన దేవత. అందుచేతనే ఆతఁడు మాలాభముకొఱకయి తాను ప్రసాదించిన వరమును మాచే రద్దుచేయించెను. తృష్ణాశూలముచే నాతఁడు శివతారాప్రజల హృదయములను భేదించి వారి నుత్త రకూటప్రజలకుఁ బాదాక్రాంతులుగఁ జేయును.

విశ్వ:—అదే నిజమయినచో మీరు సమర్పించు పూజ లొక్కింతయుఁ బూజ లనిపించుకొనవు. అవి కేవలము దేవునికిచ్చు బత్తెములే యగును.

రణ:—నాయనా, నీవు సన్నిహిత బంధు విరోధముగా పర పక్షమును బూనియున్నావు. తాను మున్ముందు వహింప వలసియున్న నుత్తరకూట పరిపాలనా ధర్మముల బ్రోత్తిగ నభిజిత్తు గుర్తెఱుఁగకుంట నీబోధనల మూలముననే.

విశ్వ:—నాబోధనల మూలముననా! నేనొకప్పుడు యుష్మత్ప్రతు వాదినేకదా? నీచర్యల మూలమున పఠాణరాష్ట్రములోఁ దిరుగఁబాటు గల్గినపుడు దాని నిర్మానుష్యము గావించి తిరుగఁబాటు నణఁచినవాఁడ నేగానా? అప్పుడే యాబాలుఁ డభిజిత్తు నాతలంపునకు వచ్చె. విద్యుల్లతిక భాతి నాతఁ డవతరించె. అజ్ఞానాంధకారముచే నావరింపఁబడిన మనస్సుతో నప్పు డెందరినో నేను హింసించితిని; వారందఱు నావంటి మానవులే యని నే నప్పుడే తొలిసారి గ్రహించితిని. అప్పుడు లోక పరిపాలకు చిహ్నము లాతనియందుఁ బొడగని యాతని నీకుటుంబమున జెట్టికొన నంగీకరించితివి. ఇపు డాతని నుత్తరకూటాధిపత్యమునకుమాత్రమే బంధించి యుంప నుంకించుచున్నావు.

రణ:—ఈరహస్యము నాతనికి వెల్లడిచేసినవాఁడ వీవ యని నా నమ్మకము. ముక్తధారా మూలమున దిక్కులేక పడి యున్న శిశు వీతఁడే యని నీవే యాతనితోఁ జెప్పితివి.

విశ్వ:—అవును. నేఁజెప్పితి; దీపావళి పండువునాఁటి రాత్రి అతఁడు గౌరీశిఖరముపైఁ దేఱిచూచుచు మేడమంటపమున నొంటరిగ నిలువఁబడియుంటఁజూచి, యేమివీక్షించు చుంటి వని నే నడిగితి. భవిష్యత్పథములు—దుర్గమమైన పర్వతపు కనుమల కడ్డముగ నింకను గట్టఁబడని పథములు— దూరమును సమీపస్థముగఁజేయు పథములు, యిట్టి భవిష్య

తృషము లు తన దృష్టికి గోచరమాయెనని చెప్పెను. ఈ పలుకులు చెవినిబడ, జ్ఞానాతీతునిగలయుఁ బ్రవహించు నీజల పాత సమీపమున నేదిక్కుమాలిన జనని గర్భముననో జనించిన యీశిశువు నెద్దియు బంధింపఁ జాలదని నే ననుకొంటిని. పట్టజాలక నే నాతనితో నిట్లంటి, "బాలకా! దారి పరిక్కను నీ వుద్భవించినపుడే నగ్నిపర్వతమే ని న్నొడిలో నుంచుకొని పెంచెను. అట్టిచోట బుట్టుటచే జననకాలము నాఁడు నీవా రొసంగు స్వాగతగీతముల విన నీవు నోచుకొనలేదు.

రణ—ఆఁ! ఇప్పుడు నాకుఁ దెలిసె.

విశ్వ:—ఏమి నీకుఁ దెలిసినది?

రణ:—నీనుండి యీవార్త విన్ననాటఁగోలె, రాజకుటుంబముపైఁ బ్రేమానుబంధ మభిజిత్తునకు వీడెను. ఈ యనిష్టతను బ్రదర్శించుటకు మొదట నాతఁడు చేసిన కార్యమేదన, నందిదుర్గ కుడ్యమును బడఁగొట్టి నందికనుమకుఁ బోవు మార్గమును దెఱచుటయే.

విశ్వ:—దానిహానియేమి? రాజబాట యందఱును వాడుకొనఁ దగినదే; దానిమీఁద శివతారవారి కెంత స్వాతంత్ర్యము గలదో యుత్తరకూటపువారికిని నంత స్వాతంత్ర్యమే కలదు.

రణ:—నాయనా! బహుదినంబులుగ నీతో నోర్చి యుంటిని. ఇంక జాలు! నీవు నారాజ్యమును విడిచిపోవలసిన దే.

విశ్వ:— నిను విడుచుట నాశక్యముకాదు. నీవే నను వీడిన నే నేమియుఁ జేయఁజాలను.

(నిష్క్రమించును.)

[అంబప్రవేశము.]

అంబ:—ఎవరు నాయనా యిక్కడ? సూర్యుఁడు గ్రుంకకున్నాఁడు; ఇంకను నా సుమనుఁడు తిరిగి రాలేదు.

రణ:—నీ వెవరు?

అంబ:—నేనెవ తెనుగాను, వాఁడే నా సర్వస్వము—ఈ బాట వెంబడినే గొంపోఁబడెను. ఈ దారి కంతము లేదా? గౌరీశిఖరమును దాఁటి పశ్చిమమునకు నా సుమనుఁ డింకను బోవుచునే యుండునా? అయ్యో! ఆయెడనె సూర్యుం డస్తమించుచున్నాఁడ; వెలుతురు నస్తమించుచున్నది; సర్వమును న స్తమించు చున్న దే!

రణ:—(మంత్రితో) నే నను కొనినది—

మంత్రి:—చిత్రము. రాజా! కట్టకట్టు పని కే వాఁడు తీసికొని పోఁబడి యుండును.

రణ:—(అంబతో) శోకము విడువుము; నమ్ముము నామాట. జీవితమున బొందఁదగిన కడసారిబహుమానమును, గొప్ప బహుమానమును నాతఁ డందినాఁడు.

అంబ:—అటులేయయిన సాయంకాలము దాని నాచేతి కిచ్చి యుండునే. నే తల్లినికదా !

రణ:—వాఁడు తెచ్చియిచ్చును; ఆ సాయంకాల సమయ మింకను రాలేదు.

అంబ:—మీ మాటలు నిజమగుఁ గాక ! ఆలయమునకుఁ బోవు నీ దారియందె నే వేచి యుండెద.

[ఆమె నిష్క్రమించును.]

[కొందఱు బాలురను వెంటబెట్టుకొని ఉపాధ్యాయుఁడు ప్రవేశము]

ఉపా:—ఈ కుఱ్ఱకుంకలకు గట్టి దెబ్బలు కావలె, నాకుఁ దెలియును. ఓరీ ! మీ కంఠములఁ బూర్తిగ నెత్తి కేకలు వేయుఁడు. జయము శ్రీ మహారాజా !!

బాలురు:—జయము శ్రీ.........

ఉపా:—...మహారాజా!

బాలురు:—...మహారాజా !

ఉపా:—జయము శ్రీ మహా రాజాధిరాజా !

బాలురు:—జయము శ్రీ మహారా—

ఉపా:—...జాధిరాజా

బాలురు:—జాధిరాజా

రణ:—ఎచ్చటి కరుగు చుంటివి ?

ఉపా:—ఆస్థానశిల్పియగు విభూతి కేలినవారు ప్రత్యేక గౌరవ మొసంగ నున్నారు. ఆ యానందమును బాల్గొ

నుట ఉత్సవమునకు నాబాలురఁ దోడ్కొని పోవుచుంటి. ఉత్తరకూట ప్రతిష్ఠయందుఁ బాల్గొను నవకాశముల నా బాలురు గ్రహింపకుండుట నామతము కాదు.

రణ:—విభూతి యేమిచేసెనో యీబాలు రెఱుఁగుదురా?

బాలురు:—[చేతులఁ దట్టుచు దుముకుచు] ఆహా! మే మెఱుఁగుదుము. శివతారవాసులకుఁ ద్రాగుటకు లేకుండ నా తఁడు నీటిని బంధించెను.

రణ:—ఏల బంధించెను?

బాలురు:—వారికి బాగుగా బుద్ధి గఱపుటకు?

రణ—ఏల?

బాలురు:—చుఱుకుఁ గొల్పుటకు.

రణ:—కారణము?

బాలురు:—చెడ్డవారు గనుక!

రణ:—ఎట్లు?

బాలురు:—వారా! అమిత దుష్టులు. అందరెఱిఁగివదే?

రణ—అయిన, వారెట్లు చెడ్డవారో మీకుఁ దెలియదుగా?

ఉపా:—నిజముగా, వారెఱుఁగుదురు దేవరా! (బాలురతో) మీకేమి వచ్చెనురా, బుద్ధి హీనులారా? మఱచితిరా— మఱచితిరా—మీపుస్తకములలో? మఱచితిరా—మీ పుస్తకములలో (మెల్లగ, నన్ననిగొంతుతో) వారి మతము చెడిపోయినది!

బాలురు:—ఔనౌను! వారి మతము చెడిపోయినది!

ఉపా:—మఱి, వారు మనవంటివారు కారు— ఊఁ చెప్పుఁడు బాలులారా, జ్ఞప్తిలేదా (తన ముక్కువంకఁ జూపును)

బాలు:—వారి కెత్తు ముక్కులులేవు; అవును!

ఉపా:—బాగు! మన శాస్త్రజ్ఞుఁడు రుజువు చేసినదికనుక మీ రెఱుఁగుదురు. ఉన్నత నాసిక యేమి సూచింపును?

బాలు:—జాతి యౌన్నత్యము.

ఉపా:—మేలు! మేలు! ఉన్నత జాతివారి దీక్ష యేమి?— చెప్పుఁడు! జయింతురు,—బిగ్గరగఁ జెప్పుఁడు!—జయింతురు, —ప్రపంచము,—తమకొఱకై అవునుగదా?

బాలు:—అవును! తమకొఱకై ప్రపంచమును జయింతురు.

ఉపా:—ఉత్తరకూట మెన్నఁడయిన యుద్ధమున నపజయము గాంచెనా?

బాలు:—లేదు! ఎన్నఁడును లేదు!

ఉపా:—మన మహారాజువారి తాతగారు, ఇన్నూట తొంబది ముగ్గురు సైనికులతో, ముప్పదియొక్క వేల యేడునూర్ల దక్షిణప్రాంత్యపు యనాగరికుల నెట్లు బరువిడఁజేసిరో మీకు విదితము. బాలులారా! అది యథార్థమేకద?

బాలు:—ఆఁ! ఔను.

ఉపా:—దేవా! ఈబాలురే మున్ముందెప్పటికయిన, నన్యదేశమున జనన మొందు మందభాగ్యుల నెల్లర భయాక్రాం-

తులఁ జేయుదురని తమరు నమ్మవచ్చును. అట్లు జరగకున్న నా యుపాధ్యాయ వృత్తికి దోష మొనరించినవాఁడ నగుదును. ఉపాధ్యాయుల బాధ్యతల నే నొక్క నిముషమయిన మఱువనొల్లను. మేము మనుజులఁ గూర్తుము. రాజ్య నిర్వాహకులు వారి నుపయోగించుట మాత్రమే—మఱి—వారు తీసికొను జీతముతో మేము తెచ్చుకొను బత్తెమును బోల్చి దేవరవారు చిత్తగింపవలయు.

మంత్రి:—ఈ విద్యార్థులే మీ కుత్తమ పారితోషికము.

ఉపా:—ఏమి చిత్రముగాఁ జెప్పఁబడె! నిశ్చయము, "వారే మీ కుత్తమ పారితోషికము! సెబాసు!" కాని, దేవా, ధరలు పెరుగుటచే నీ దినములలో జీవనోపాధి కష్టసాధ్య మయినది. ఇందుకు దృష్టాంతము—పూర్వ మొకప్పు డావు వెన్న—

మంత్రి:—ఇఁక చాలింపుము. ఆవు వెన్న విషయము నే నాలోచించెద. నీవిఁక సెలవు గైకొనవచ్చును.

(బాలురతో నుపాధ్యాయుఁడు నిష్క్రమించును.)

రణ:—ఈ యయ్యవారి బుఱ్ఱలో నావు వెన్న తప్ప మఱేమియు లేదు.

మంత్రి:—అయినను, దేవా! అట్టివారివలనఁ బ్రయోజన మున్నది. చెప్పుమనినరీతిగా నాతఁడు పాఠముల నేకరువు బెట్టుచుండును. వీని కెక్కువ యింగితమున్న నిట్టికార్య మసాధ్యమయి యుండుగదా?

రణ:—ఆకాశముపై నదియేమి?

మంత్రి.—ఆవిషయమున పరాకు పడితిరా? అదియే విభూతి నిర్మించిన యంత్రశిఖరము.

రణ:—ఇంత స్పష్టముగ నే నెన్నఁడు దీనిఁజూచి యుండలేదు.

మంత్రి:—నేఁ డుదయమున గొట్టిన తుపానుచే నంబరము వినిర్మల మాయెను. అందుచే నిది నేఁ డింత స్పష్టముగ నున్నది.

రణ:—దాని వెనుకఁ గోషోద్రేకముచే నెఱ్ఱబాఱిన సూర్యునిఁ జూఁడవా? జడిపించుచున్న రాక్షస ముష్టివలెనున్న దీ యంత్రము. అంత యెత్తు దాని లేవఁదీయుట మిక్కిలి యనుచితము.

మంత్రి:—అంబరహృదయమునశోక విహ్వాలతయో యన నది గన్పడుచున్నది.

రణ:—మన మాలయమునకుఁ బోవ సమయమయినది.

(నిష్క్రమింతురు.)

# ముక్తధార.

[ఉత్తరకూటవాసుల మఱియొక గుంపు ప్రవేశము.]

మొదటి:—ఈమధ్య విభూతి మనలఁ దప్పుకొనిపోవఁజూచుట కనిపెట్టలేదా? మనతోఁ బాటుగఁ బెరిగిన సంగతిని తన దేహమునుండి దులిపివేయ యత్నించుచున్నాఁడు. ఒఱను మించి పెరుగుట కత్తి కనర్థదాయకమని యొకప్పు డనుభవపూర్వకముగ నెఱుఁగఁ గలఁడు.

రెండవ:—నీ వేమి జెప్పినను సరే. కాని విభూతి యుత్తరకూటముయొక్క యశమును నిలువఁబెట్టెను.

మొదటి:—నీ తెలివి తక్కువ చాలును. వాని నమితముగ పొగడుచుంటివి. వానికున్న ప్రజ్ఞ నంతను వినియోగించి కట్టిన యీకట్ట కనీసము పదిసార్లు కూలెను.

మూడవ:—ఇంకొకసారి కూలునేమో, యెవరు చెప్పగలరు?

మొదటి:—ఉత్తరమున నా దిబ్బఁజూడు.

రెండవ:—దాని విషయ మేమి?

మొదటి:—నీ వెఱుఁగవా? దానిఁజూచినవా రందఱుఁ జెప్పుదురు.

రెండవ:—ఏమని? నాకుఁ జెప్పు.

మొదటి:—ఓయి వెఱ్ఱివాఁడా! నీకుఁ దెలియదా? ఒక కొన నుండి మఱియొక కొనవఱకు కది యంత—అఁ యేమని చెప్పు దును వట్టి చిత్ర!

రెండవ:—కొంచెము స్పష్టముగా విప్పి చెప్పుమా.

మొదటి:—కొంచెముండుము. దానంతట నదే స్పష్టపడ గలదు. ఒక్కసారి హఠాత్తుగా (చేతులతో జూపును)

రెండవ:—అమ్మయ్యో; అంతయుపద్రవమే! హఠాత్తుగానే?

మొదటి.—ఔను! దీనిఁగూర్చి యాగుర్ఁడు సాంతముగాఁ జెప్పఁ గలఁడు. దాని ప్రతి యంగుళము నాతఁడు కొలి చెను.

రెండవ:—యాగుర్ని యుత్తమలక్షణమే యది. వానికిఁ జల్లగ నాలోచనఁ జేయు నద్భుతశక్తి విపరీతముగ గలదు. ఎల్లరు నాశ్చర్యముచే నోడలు మఱచియుండ నాతఁడుకొలత త్రాటిని నెమ్మదిగఁ దెచ్చును.

మూఁడవ:—కొందఱేమందు రన, విభూతి నేర్చిన శాస్త్రము.

మొదటి:—అవును! నిజమే! వేంకటవర్మనుండి తస్కరించినది. ఆతఁడెంత గొప్పవాఁడు! అఁ, గొప్పవాఁడన నాతఁడే! అతని బోలినవాఁ డెవ్వఁడును లేఁడు. ఏమిబుద్ధి! ఏమి యసా ధారణ మేధాశక్తి! అయిననేమి! బహుమానము లన్నిఁటి విభూతి పడయును; పాప మాతఁడు;—ఆతఁడు తిండికి లేకయే మాడి చచ్చెను.

మూడవ:—తిండికి లేకుంట చేతనేనా?

మొదటి:—తిండికి లేకనో, పరహస్తమునుండి తినుటచేతనో, యెవరికెరుక ? అయిన నావిషయమును చర్చించుటవలన నేమిలాభము ? మన మూడుమాటల నెవరయిన వొంచుండి విందురు. ఈదేశమున పలురకముల యూపవాద వ్యాపకులు గలరు. మనవా రొరులమంచి విన నొల్లరు.

రెండవ:—నీ వే మన్నను, వాఁడొక—

మొదటి:—దాన నాశ్చర్య మేమి ? అతఁ డేనాఁడులో ఁబెరిగె నో యోచించినఁ జాలును. ఆ మన బాబువాగ్రామము, మా ముత్తాతగారి జన్మభూమి అయినది నీ వెఱుఁగవా ? —నీ కాయన పేరు తెలిసి యుండవచ్చు.

రెండవ:—సందేహ మేమి ? ఉత్తరకూట వాసుఁడు ప్రతి మనుష్యుఁడు నాతని నెఱుఁగును. అతఁడు—అతని పే రేమి?

మొదటి:—భాస్కరుఁడు. ఉత్తరకూట రాజ్యమంతలో నస్త్ర ముఁ జేయు సామర్థ్యమున నాతనికి సాటివచ్చు వాఁ డెవ్వఁ డును లేఁడు. శత్రుజిత్తుమహారాజు వానియొద్ద నస్త్రము గొనకుండ నొకరో జయినను వుచ్చ లేదు.

మూఁడవ:—మనమిఁక నాలయమునకుఁ బోవ వేగిరింతము. మనము విభూతిగ్రామమువారము. అతని కుడిప్రక్కను మన ముందము.

(తెర వెనుకనుండి పటుఁ దఱచును.)

మిత్రులారా! పోకుఁడు, పోకుఁడు! ఈ దారిని దొలఁగి పొండు.

రెండవ:—అదే! ముసలి వటుఁడు!

(చినిగిన కంబళి గప్పుకొని, చేత శంకరకఱ్ఱ బూని వటుఁడు ప్రవేశము)

మొదటి:—ఎచ్చటికిఁ బోవుచుంటివి, వటుఁడా?

వటుఁడు:—జాగ్రత్త, మిత్రులారా! ఆ దారిని బోకుఁడు! కాలము మించకుండఁ దిరిగి పొండు!

మొదటి:—ఏమి? ఏమి?

వటుఁడు:—బలివేయుదురు.—మానవుల బలివేయుదురు. నా మనుమల నిద్దరి బలాత్కారముగఁ గొనిపోయిరి.; వారు తిరిగి రా రైరి.

మూడవ:—బలియే! ఎవరికి?

వటుఁడు:—తృష్ణా పిశాచమునకు!

రెండవ:—అది యెవరు?

వటుఁడు:—తైల పోషిత యగ్నిజ్వాలవలె వృద్ధియగుచుండు తడియారిన నాలుకగల పిశాచము.

మొదటి:—పిచ్చివాఁడా! మేము భైరవాలయమునకుఁ బోవుచున్నాము. ఈతృష్ణా పిశాచ మచట లేదే!

వటుఁడు:—నీకీ వార్త తెలియదా? నేఁడు భైరవుని సింహాసనమునుండి తొలఁగింప నున్నారు; పిమ్మట తృష్ణాపిశాచ మాపీఠము నధిష్ఠించును.

రెండవ:—నోరుమూయుము. పిచ్చివాఁడా! నీవిటు మాటాడ వినినచో నుత్తరకూటవాసులు నిన్ను తుత్తునియలు సేతురు.

వటుఁడు:—వారు నాపై మట్టి విసరుచున్నారు; చిన్నవాండ్రు ఱాలు ఱువ్వుచున్నారు. ప్రాణ సమర్పణముచేసి నామనుమలు ధన్యత గాంచిరని యందఱనుచున్నారు.

మొదటి:—అది నిజమే!

వటుఁడు:—నిజమేనా? ఒక్క ప్రాణము పోయిన నింకొక ప్రాణము రావలెను. మృత్యువునకు బహుమానము మృత్యువుకాదు. అట్లు కానియెడల భైరవుఁ డింత గొప్ప నష్టమును సైరింపఁడు. జాగ్రత్త! మిత్రులారా! ఆబాటను బోవలదు. [వటుఁడు పోవును]

రెండవ:—ఇతని పలుకులు గుండె ఝల్లుమనఁజేసి వణకుఁ బుట్టించుచున్నవని చెప్పక తీరదు.

మొదటి:—రంజూ, నీవు వట్టి పిఱికివాఁడవు. పోదము పద. [అందఱు నిష్క్రమింతురు]

[యువరాజగు అభిజిత్తు, రాజకుమారుఁడు, సంజయుఁడు ప్రవేశము.]

సంజయ:—మానగరు నీవేల విడచు చుంటివో నాకు బోధపడలేదు.

అభిజిత్తు:—నీ కది పూర్తిగ బోధపడదు. నా జీవిత వాహిని రాజగృహ శిలల దాఁటి నిరాటంకముగఁ బ్రవహించును; దీని నీవెట్లు గ్రహింపఁ గలవు.

సంజయు:—నీకు కొన్ని దినములుగ చిత్తశాంతిలేదని మాకు గోచరించినది. నిన్ను మాతోఁ జేర్చియుంచిన బంధము దినదినము సడలు చున్నదేమో యని తోఁచుచుండెను. తుదకది తెగిపోయెనా?

అభిజిత్తు:—సంజయా! గౌరీశృంగమున నస్తమించు భానుబింబమును దిలకింపుము. అగ్నిప్రభను బోలు నీ యరుణ పతంగము తన పక్షములఁ జూపి నక్షత్రపథంబునఁ బాఱు చున్నది. సాహసాంకిత మగు నా జీవయాత్రా చిత్రము నస్తంగతసూర్యుఁ డంబరతలంబున లిఖించియున్నాఁడు.

సంజయు:—ఆచిత్రము నాకు భిన్నముగా నున్నది. అల్లదె! యంత్రాగ్రము సంధ్యావధూటీ హృదయము నెట్లుచీల్చుచున్నదో చూఁడుము. ఏటు దినిన పులుఁగు తలఁకిందుగ నిశాసానువునఁ బడిన చందము దోఁచుచున్నది. ఇది దుశ్శకునము. విశ్రాంతి గైకొన సమయ మిది. నగరులోనికి రమ్ము.

అభిజిత్తు:—ఆటంకమున్నచో విశ్రాంతి గలుగదు.

సంజయుఁడు:—ఇన్నినాళ్ళుగఁ దోఁచని దిపుడెటు లాటంకమని తోఁచినది?

అభిజిత్తు:—ముక్తధారాప్రవాహమును వారు బంధించిరని వినినపుడు నాకది గోచరించె.

సంజయు:—ఈ మాటల కర్థము నాకు బోధపడుట లేదు.

అభిజిత్తు:—ఒక్కొక్కని యాత్మయాత్రారహస్యము బాహ్యప్రపంచమున నెచ్చోటనో లిఖింపఁబడి యుండును. స్వీయయాత్రారహస్యము ముక్తధారా జలపాతమున గుర్తింపఁబడియున్నది. దాని కదలకుండ బంధించుట గాంచినతోడనె నాప్రాణములు తమస్స్థానమును బాసిన ట్లాయెను. ఉత్తరకూటరాజ్యపీఠము నాప్రాణవాహినికిఁ జెలియలికట్ట యని గ్రహించితి. కావున దాని నిరోధ రహితముగాఁ జేయుట కిలు వెలుబడితి.

సంజయు:—నీ యనుచరునిగ నన్ను గొనిపొమ్ము.

అభిజిత్తు:—అటుగాదు! నీదారిని నీవ వెదకికొనవలయు. నీవు నా వెంటవచ్చిన నియతమగు నీసొంతదారిని నేను గప్పిపుచ్చినవాఁడ నగుదు.

సంజయు:—అంత కాఠిన్యము వహింపకుఁడు. నాకు నొప్పిగల్గుచున్నది.

అభి:—నాహృదయము నీకుఁ దెలిసినదే, కాన నీకు నొప్పిగల్గించినను నీవు నాయెడఁ దప్పభిప్రాయ పడవు.

సంజయు:—నీ కెచటినుండి యీసందేశము వచ్చినదో దానిని గూర్చి నిన్ను పృచ్ఛసేయను. దాని నటుండనిమ్ము; యువరాజా! అదె సాయంకాలమైనది. నిశాగమనసమయరాగము రాజగృహోపరిభాగమునుండి వీచికలభాతి, జను

దెంచుచున్నది. దీనిసందేశము నీకు వినఁబడుట లేదా? కఠోరములై కష్టసాధ్యములగున వన్నియు కీర్తిప్రదములై యుండిన నుండవచ్చును; కాని మృదులంబు లగు వానికిఁ గూడ విలువ లేకపోలేదు.

అభి:—కష్టముల నాచరించుట సుఖములఁ గొనుటకేకద.

సంజయ:—దేవతార్చనా పీఠముకడ మొన్న నొక సితాంభోజముఁ గని విస్మయము జెందితివి; నీకు జ్ఞాపకమున్నదా? ప్రభాతమునను నీవు మేల్కాంచక మునుపె యెవతెయో యీపుష్పమును గోసియుండును. అది యెవతెయో నీకు దెలియలేదు. ఈస్వల్పవిషయమున నిమిడియున్న దైవప్రసాదమును, ఇట్టితరుణమున నీవు నిర్లక్ష్యభావముతోఁ జూడ నగునా? తాను ప్రచ్ఛన్నముననుండి తన కానుక నెదుట నుంచిన పాప మాపడుచు ఎల్లప్పుడు నీస్మరణకు వచ్చుట లేదా?

అభి:—అవును. వచ్చుచునే యున్నది! ప్రపంచమందు నిట్టి యనురాగముకొఱకై, నేనీ భీభత్సపురూపము సహింపఁజాలను. అయ్యది ప్రకృతిరాగమును నశింపఁజేసి అంతరాళమున దన అయోమయదంతపంక్తులఁ బ్రదర్శించుచు నపహసించును. దివ్యస్వర్గమును నభిలషింతును. కావున నే అందులకు భంగము కలిగించు రాక్షసులతోఁ బోరుటకు సంసిద్ధుఁడనయి యున్నాను.

సంజయు:—అల్లదె యా జేగురుగొండ నాశ్రయించియున్న సంధ్యారాగములోన దుఃఖము చిత్రితమయి యుంట జూచితివా?

అభి:—లేకేమి! నాహృదయము శోకపూరితమై యున్నది. కాఠిన్యమును శౌర్య మని నే నెన్నటికినిగొనియాడను. చింత మాని అత్యున్నత శాఖాగ్రముపై నేకతమున గూర్చుండియున్న యాచిన్నపిట్ట నవలోకింపుము. అది తన కులాయమునకు జేరుకొనం బోవునో లేక, యీ చీకటిలో విదూరస్థకాంతారంబునకుం బ్రయాణముం గొనునో నే నూహింపజాల. కుంకనున్న దివాకరు నంత్యకిరణములపై దృష్టి నాటించుచు నొంటిగనున్న పిట్టను జూడ నాహృదయాంతరాళ మానందజనక మగు విచారముతో వెల్లివిరియుచున్నది! ఆహా! ఈప్రపంచ మెంత రమణీయముగ నున్నది. నాజీవితమున కింపుగూర్చువాని కెల్ల నివియె నా ప్రణామములు.

(వటుడు ప్రవేశము)

వటు:—నన్ను బోనీయక దెబ్బలగొట్టి వెనుకకు దఱిమివేసిరి.

అభి:—నీకేమాయెను, వటుడా! నీనుదుట గాయమున్నది; దానినుండి, అయ్యో, రక్తము కారుచున్నది.

వటు:—వారిని జాగ్రత్తగా నుండుడని చెప్పుటకు బయటికి వచ్చితి; ఆబాటను విడి తిరిగి పొమ్మని యరచితిని.

అభి:—అట్లేల జేసితివి?

వటు:—రాజకుమారా! నీ వెఱుఁగవా? యంత్రపుబలిపీఠమున దృష్టాపిశాచము నెక్కింపనున్నారు. ఆపిశాచమునకు మానవబలి నర్పింతురు.

సంజయ:—ఈ యసంబద్ధ ప్రలాపము లేమి?

వటు:—ఇదివరకే యీబలిపీఠపు పునాదిని నాయిద్దఱి పొత్రులరక్తమును బోసిరి. స్వీయాధర్మ భారముచే నీ పాపపుగుడి వ్రక్కలై పోవునని యాసించితిని. కాని యటు లింకను జఱుగలేదు; భైరవస్వామి యింకను నిద్దురనుండి మేల్కాంచనే లేదు.

అభి:—సందేహింపకుము, గుడి ముక్కలై పోవును, కాలమాసన్న మైనది.

వటు:—(దగ్గరకు వచ్చి చెవిలో నూదును) అయితే, నీవు వినియుంటివి,—వినియుంటివి, భైరవాజ్ఞ.

అభి:—ఆఁ, నే వినియుంటిని.

వటు:—అయిన, నీకుఁదప్పించుకొను నుపాయములేదు ?

అభి:— నాకెక్కడి యుపాయము!

వటు:—నాగాయము నుండి రక్తమెట్లు ప్రవహించు చున్నదో చూచుటలేదా? రాజపుత్రా, నీహృదయమునకే గాయము తగిలిన నీవు సహింపఁగలవా?

అభి:—భైరవ కటాక్షమున నే సహింపఁజాలుదు.

వటు:—ఏమీ! సర్వజనులు నీపై శత్రుత్వముఁ బూనినపుడునా? స్వజనులే నిన్ను నిరాకరించినపుడునా?

అభి:—నేభరింపవలెను!

వటు:—అయిన భయము లేదు!

అభి:—నాకై భయము లేదు.

వటు:—బాగు, బాగు! నన్ను జ్ఞప్తియం దుంచుకొమ్ము; నేను నదే త్రోవకుఁ బోవనుంటి. స్వయముగ భైరవస్వామి నానుదుటిపైఁ బూసిన శోణితపు టానవాలునుబట్టి అంధకారంబుననయిన నను గుర్తింపఁగలవు.

(వటుఁడు పోవును.)

(రాజకింకరుఁడు. యుద్ధవుఁడు ప్రవేశము)

యుద్ధ:—(యువరాజుతో) స్వామీ! నందికనుమగుండ బాటను నీవేల జేసితివి?

అభి:—శివతారవాసుల శాశ్వతక్షామమునుండి కాపాడుటకు.

యుద్ధ:—మనరాజు సదయుఁడే! వారి కుపకారము సేయుటకాతఁ డనిశము సంసిద్ధుఁడయి యుండలేదా?

అభి:—లోభము చేత దక్షిణహస్తము, సమృద్ధి మార్గమును బూడ్చివేయ, వామకరమునఁజూపు దాతృత్వ మావంతయు నుపయోగకారి కాదు. కావున శివతారలోనికి జీవ

నోపాధికి వలయుసామగ్రిఁ గొంపోవు మార్గమును తెలిచి వైచితివి. దారిద్ర్యశ్రీయమైన కరుణ నే సరకుసేయను.

యుద్ధ:—రాజుగా రనునది, నందికనుమలోని దుర్గమును బ్రద్దలుచేసి, యుత్తరకూటమువారి ఆహారపాత్రి మట్టె నూడబెఱికితి వని ?

అభి:—ఎల్లకాలము శివతార నాశ్రయించుకొని యుండకుండఁ జేసి యుత్తరకూటమునకు స్వైరంబు నిడితి.

యుద్ధ:—అందు నీ వమితాటోపమున వర్తించితివి. రాజునకీ వార్త తెలిసినది. ఇంతకుమీఁటి చెప్ప నే సాహసింపఁజాల. చేతనయిన తక్షణమె యిచ్చోటు వీడిపొమ్ము. త్రోవలో నీతో మాటలాడుచున్నప్పు డెవరయిన నన్నుఁ జూచిన కొంప మునుఁగును.

(యుద్ధవుఁడు పోవును.)

(అంబ ప్రవేశము)

అంబ:—సుమనా, నాకూనా ! నా సుమనుని గొంపోయిన దారిని మీలో నొక్కఁడయినఁ బోలేదా ?

అభి:—నీ తనయుని గొంపోయిరా ?

అంబ:—అవును, పశ్చిమమునకు. ఇనుఁ డస్తమించెడి, దినము లంతమొందెడి యాదిశకు.

అభి:—నా ప్రయాణముకూడ యా బాటనే.

అంబ:—అటులయిన, నే నిర్భాగ్యురాలను. నన్ను మఱువకుము. అతని గలిసికొనిన, అమ్మ వేచి యున్నదని చెప్పుము.

అభి:—సరే, చెప్పెదను.

(అంబ పోవును.)

(భైరవార్చకులు పాడుచుఁ బ్రవేశింతురు.)

జయ భైరవ జయ శంకర
జయ జయ జయ ప్రళయంకర
శంకర శంకర.
జయ సంశయ భేదన
జయ బంధన ఛేదన
జయ సంకట సంహార
శంకర శంకర.

(ఎల్లరు నిష్క్రమింతురు.)

# ముక్తధార.

(విజయపాలుఁ డను యోధుఁడు ప్రవేశము.)

విజయ:—రాజపుత్రులారా! నా వినయపూర్వక వందనములఁ గైకొనుఁడు. నేను రాజుగారి యొద్దనుండి వచ్చితి.

అభి:—వారియాజ్ఞ యేమి?

విజయ:—నీతో నేకాంతమునఁ జెప్పవలెను.

సంజయ:—[అభిజిత్తుహస్తమును బట్టుకొని] ఏకాంతమున నేల?—నాకును రహస్యమా?

విజయ:—నా కిడిన యాజ్ఞ యట్టిది. యువరాజా! గుడారము బ్రవేశింప నిను వేడుచున్నాను.

సంజయ:—నే నాతని వెంబడి పోయితీరెద. (పోఁబోవును)

విజయ:—కూడదు! అటుచేయుట రాజాభీష్టమునకు వ్యతిరేకమవును.

సంజయ:— సరే, నే నీ బాటప్రక్క నాతనికై వేచి యుందును.

(విజయపాలానుచరుఁడయి యభిజిత్తు గుడారమువైపు పోవును)

(పుష్పలావిక ప్రవేశము.)

పుష్ప:—(సంజయునితో) అయ్యా, ఈతఁ డెవరు? యుత్తరకూట విభూతియా?

సంజయ:—అతని నేల వెదకుచుంటివి?

పుష్ప:—నా దీయూరు కాదు; దేవతలినుండి వచ్చుచుంటి. ఉత్తర కూటములో నాతని త్రోవను పూలఁ జల్లుచుంటి రని వింటి. ఆతఁ డొక మహాత్ముఁడయి యుండును గాన నా సొంతపూఁదోఁటనుండి, యీపుష్పములఁ గొనివచ్చితి.

సంజయ:—ఆతఁడు మహాత్ముఁడు కాఁడు; ఉపాయశాలి.

పుష్ప:—అతఁ డేమి చేసెను?

సంజయ:—మా జలపాతమును బంధించెను.

పుష్ప:—అందుకొఱకా యింతపూజ? జలపాత బంధనము వలన దైవాభీష్టము సిద్ధించునా?

సంజయ:—కాదు, కాదు. అది దైవగతినే యడ్డగించును.

పుష్ప:—నా కవగాహనముగాలేదు.

సంజయ:—అవగాహనము కాకుండుటయే నీకు మేలు. తిరిగి పొమ్ము, (ఆమె పోనుండును) నిలుము; ఒక్కమాట చెప్పుము! ఆసితాంభోజమును నాకమ్మెదవా?

పుష్ప:—దీని నే నమ్మఁగూడదు; ఇదివఱకె దీని నామనంబున నొక మహాత్ముని కర్పించితి.

సంజయ:—దీనిని, అందరికంటె నెక్కువగ నే గౌరవించు పరమ పురుషున కిచ్చెదను.

పుష్ప:—అటయినఁ దీసికొమ్ము. (ఆతఁడు వెల నియ్యఁబోవును) వలదు! దీనికి వెలలేదు! నానమస్కృతుల నాతం

డిగ్రీకి సమర్పించుము. దేవతలిగ్రామవాసి నగు పేదరాల ననియు, పూల నమ్మెదాన ననియుఁ గూడఁ జెప్పుము.

(ఆమె పోవును)

[విజయపాలుఁడు ప్రవేశము]

సంజయు:—యువరా జెక్కడ?

విజయు:—గుడారమున బద్ధుఁడయి యున్నాఁడు.

సంజయు:—యువరాజు బంధితుఁడా! ఏమి తగని పొగరు?

విజయు:—రాజుగారి ఒడిన యాజ్ఞాపత్రి మిదిగో!

సంజయు:—ఎవరికుత్రి యిది? ఒక్క నిమిష మాతని కడకుఁ బోయెద.

విజయు:—క్షమింపుఁడు, పోనీయఁజాల.

సంజయు:—అయిన నన్నుఁగూడ బంధింపుము! నేను రాజాజ్ఞ నుల్లంఘించినవాఁడను!

విజయు:—నా కా యుత్తరువు లేదు.

సంజయు:—ఆయుత్తరువును బలవంతమున గొనుటకు నేనె యాతనియొద్దకుఁ బోయెద. (కొంతదూరము పోయి, మరలి వచ్చును) నాపేరు చెప్పి యీసితాంభోజమును యువరాజున కిమ్ము.

[వారు పోవుదురు]

[శివతారనుండి వెంబడించుచున్న పురజనులతో శివతారవాసి యగు శైరాగి ధనంజయుఁడు ప్రవేశము]

ధనం:—(అనుచరులలో నొకనితో) దయ్యము వలెఁ గళాహీనమై యుంటివే! ఏల? ఏమి విశేషము?

మొదటి:—(శివతారవాసి) ప్రభూ! రాజుబావమఱది చండపాలుఁడు కొట్టు దెబ్బలు సహింపలేకున్నాము.

(శివతారనాయకుఁడు గణేశుఁడు ప్రవేశము)

గణేశ:—బాబూ, నీ వాజ్ఞనొసఁగుము! ఆతులువ చండపాలుని హస్తదండమును పెనగులాడి తీసికొని, నా దెబ్బ నాతనికిఁ బూర్తిగ చవిఁజూపెద. సెలవిమ్ము!

ధనం:—దెబ్బ కానిది, యెట్లు రుచించునో పూర్తిగ వారికిఁ జూప యత్నించిన మేలు. చుక్కాని తరంగముల నఱకుటకు కాదు, సరిగ నిలిచియుండి వాని జయించుటకు.

రెండవ (శివ):—అయిన మీ యభీష్ట మేమి?

ధనం:—తల నెత్తికొనుము! ఏదియు నిన్ను హింసింపఁ జాలదని యనుకొనుము; హింసయే యంత మొందును.

మూడవ (శివ):—నన్ను నేదియు హింసింపఁజాలదని చెప్పుట కష్టము.

ధనం:—మనలోని పరమపురుషుఁ డొకయగ్నిజ్వాల. తేజమన్నిహింసల దహింపఁజేయును. స్థూలకాయము మోటు

మెకము వంటిది. దెబ్బతగిలిన నది యేడ్చుచుఁ బోవును— నోళ్ళ నంతగా తెలిసికొని నిలుచుంటి రేల? నా మాటలు తెలిసికొనలేరా!

రెండవ (శివ):—బాబూ, మిమ్ముల తెలిసికొంటిమి! మీమాటల తెలిసికొనకపోయిన నేమి లోపము ?

ధనం:—అయిన, మీ మనసిటికి మందు లేదు.

గణేశ:—మాటలఁ దెలిసికొనుట కెంతయో కాలము పట్టు ననుట నిజముకాని, నిన్నుఁ దెలిసికొనిన తత్క్షణమే సురక్షితుల మగుదుము.

ధనం:—తత్క్షణమే సురక్షితులా ? అయిన తరువాత మాట యేమి ?

గణేశ:—మాకు నీడ నొసఁగువాఁడవు నీవ యని మాకుఁ దెలియును. అది తెలిసికొనుటయేకద.

ధనం:—కాదు. ఎంతమాత్రమును గాదు. అందు వలననే, యింకను క్రోధముచే మీ కను లెఱ్ఱబారి యున్నవి. మీ వాక్కునందు సంగీతములేదు. తగిన రాగము నందిత్తునా?

(పాడును)

ద్విపద॥ పరమేశ నీ విష్టపడియెద వేని
పోరిఁ బోరి దెబ్బ లేఁ బొందెదగాక.

పిటికి పందలారా! హింసనుండి తప్పించుకొన నితరులకు హింసచేసినఁ జేతురు, లేకున్న పలాయితు లగుదురు.

రెండును నొకటియె. రెండును స్థూలకాయమునకు సంబంధించిన యవస్థలే.

(తిరగ పాడును)

గీ॥ పారిపోయియొ డాగియో భయముచేత
నిన్ను విడిచిపో నేఁ బ్రియత్నించి నపుడు
న న్నరసిపట్టి బంధించి నాదు సర్వ
మును కడంకమై నీవు గైకొనగ నగును.

నాయనలారా, గమనింపుడు! మృత్యుంజయుఁడగు భగవానునితోఁ బద్దుఁబరిష్కరింపఁ బోవుచున్నాను. నే నతనితో నిటు లనగోరియుంటి, "ననుఁ బరీక్షించి చూడుము, దెబ్బలు నన్ను హింసించునో, హింసింపవో." భీరువులతోడను, భీకరులతోడను ఈ యాత్రయందు నా పడవను నింపను.

(తిరుగ పాడును)

గీ॥ ఇదియె నాకడసారి పన్నిదము సుమ్ము
నీవె గెలుపొందెదో లేక నేనె గెలుచు
వాఁడనో యది ముమ్ముందు జూడనగును;
విపణులను వీధులను సమావేశములను
ఎల్లచోటుల నవ్వుచు నెలమి నుండు
నన్ను నేడ్పింపఁగలవో కానంగవలయు!

(అందఱు కలిసి కేక వేయుదురు) సెబాస్, నాయనా! "నన్ను నేడ్పింపఁ గలవో కానంగ వలయు!"

రెండవ(శివ)—మీ రెచటికిఁ బోవుచున్నారు ?

ధనం:—రాజుగారి యుత్సవమునకు.

3(శివ):—రాజుగారు చేయు నుత్సవము నీకొఱకుగాదే. నీ వచటి కేల పోవలయును ?

ధనం:—రాజస్థానమున నా పేరెఱుక పడుటకు.

4 (శివ):—నీ వొక్కసారి దొరికిన, ఆఁ, అతఁ డప్పుడే—ఛీ యట్లెన్నటికి జఱుగఁ గూడదు.

ధనం:—కానియ్యి వయ్యా! పూర్ణముగాఁ గానిమ్ము!

1 (శివ)—గురోజీ! రాజునకు నీవు భయపడవు. కాని మేమో, అతలిపోదుము.

ధనం:—మీ రాతనికి హానిఁ జేయ లోలోనఁదలంచుచున్నారు. కాన నే యిట్టిభయము. నే నెన్నఁటికి హాని సేయఁగోరను. కాన నే భయపడను.

2 (శివ):—మేలు, మేలు! మేమును మీ వెంబడి వచ్చెదము!

3 (శివ):—సరే! మనము రాజస్థానమున కేగుదము.

ధనం:—రాజు నే మడిగెదరు?

3(శివ):—అడుగుట కేమి! అనేకము లున్నవి. కాని యం దీయబడునది యేది యని సందేహము.

ధనం:—రాజ్యము నేల యడుగరాదు!

3 (శివ):—అయ్యా, హాస్యముఁ జేయుచున్నారు!

ధనం:—ఎన్నఁటికి నట్లుగాదు! రాజ్యము రాజుది మాత్రమే యయి, ప్రజలది కూడ గానియెడల రాజ్య మొక్కపాద

ముపై నెగురుచుండ మీరు భయావహులరై వణఁకవల
సినదే! కాని అట్టిస్థితికి దేవుఁడు సహితము కంటఁదడి
పెట్టును. రాజు క్షేమముకొఱకే మీరు రాజ్యము నడుగ
నగును.

2 (శివ):—అపుడు వారు మమ్ము తోసివైచిన?

ధనం:—మీ రడుగు దానిలో యథార్థమున్న యాతోపును
తిరుగ రాజే యనుభవించును.

(పాడును)

ద్విపద॥ స్మరణకు రాదుగా పరమేశ నీవు
కరుణ మమ్ముల నిదు కడఁజేర్చు మాట.

నాయనలారా! మీ కిందున్న నిజము చెప్పెదునా?
వినుఁడు. సింహాసనము లోకేశునిదని మీరు గుర్తింప కున్నంత
కాలము, దానిని మీ రడుగుట నిష్ఫలమగును.

(తిరుగ పాడును)

ద్విపద॥ మమ్మెఱుంగని కారణమ్మునగాదె
గుమ్మము చేరిన మమ్ముల గాంచి
తలుపులు వేతురు ద్వారపాలకులు
వెలుపలనే మేము నిలుచుండగాను.

ద్వారాధికు లెట్లు మమల గుర్తింపవలయు? మన నొస
టిపై రాజచిహ్నము పరాగాచ్ఛాదితమయి యున్నది. మన
వాక్కును స్థిరపరుప నిదర్శనముల నేమియుఁ జూపలేము.

గీ॥ జీవ మిడితివి మాకు నీచేతులార
మరియు దానితో మానంపుమకుట మిడితి;
కాని లజ్జ, యాసయు, సిగ్గు దాని బట్ట
మలినహస్తములను జిక్కి మాసిపోయి
ప్రతిదినంబును నీ యీవి ప్రభను దగ్గు.

1 శివ:—మీ రెన్ని చెప్పినను, మీరు రాజస్థానమునకుఁ బోవ హేతువేమో మేము గుర్తింపలేకున్నాము.

ధనం:—కారణము నేఁ దెల్పుదునా ? మీ విషయమై నా మనసుః సందియపడుచున్నది కాన-

శివ:—ఏమి తండ్రి, అట్లంటిరి?

ధనం:—ఈఁత నేర్చుటలో, మీ రెంతవరకు నన్నంటి యుందురో, యీఁతమెలఁకువ నంత మరచిపోవుటయే కాక, నన్ను గూడ దిగలాగుదురు. మిమ్ముల వీడి యెవ్వరును వెంబడింపలేని తావు కేగెద.

1 శివ:—రాజుమాత్రము మిమ్ముల సులభముగఁ బోనీయరు?

ధనం:—పోనిచ్చుట కతఁ డెవరు?

శివ:—నిన్ను హింసించిన మే మూరకుండలేము!

ధనం:—ఈ నా దేహము నెవరికి నే నర్పించితినో యాయన యే నామూలమున హింసబడ నిష్టబడ, మీరును నెమ్మదిగ నుండవలె.

శివ:—మేలు మేలు! సరే, నాయనా! మేమును వచ్చెదము, కానున్నది గానిమ్ము!

ధనం:—నాకై మీ రిచట వేచియుండుఁడు. ఇది పరస్థలము. ఈ ప్రాంత్యమునుగూర్చి కొంత తెలియఁజేసికొనవలయును.

[ధనంజయుఁడు పోవును]

1 (శివ):—ఈయుత్తరకూటవాసుల ముఖవైఖరిఁ జూడుము. సృష్టికర్త వీరిని జేయునపుడు పెద్దమాంసపుపిండలితో ప్రారంభించి సాంతముగ జేయ వ్యవధి లేకుండనోవు !

2 (శివ)-వీరు తొడిగికొనిన బిగువు దుస్తులఁ జూడు !

3 (శివ):—ఓయి ! నీకు తెలియదా ! వారిలో నన్ను దినుమంతయు బయటకుఁ బోకుండ బిగించి తమకు తామే మూట గట్టుకొందురు.

1 (శివ):— వారు పుట్టుకతోడనె కష్టజీవులు. సంతసంతకును, రేవుస్థలములకు, వెంట వెంట బోవుచు జీవితముల గడపుచున్నారు.

2 (శివ):—చెప్పుకొనదగిన విజ్ఞాన మేమియు వారికి లేదు. ఇఁక వారిగ్రంథములో, వట్టి పనికిమాలినవి.

1 (శివ):—కేవల మట్టివే ! వాని పుటలపైఁ జదలు బారులుగట్టి ప్రాకుచున్నటు లుండునుగా!

3 (శివ):—సెబాస్, ఏమిమాట ! చెదలు నిజముగ చెదలే? వారి విజ్ఞానమే అన్నింటి దుత్తునియలుగ గొరికి వేయును.

1 (శివ):—పుట్టలగూడ బెట్టును. హస్తములతోఁ బ్రాణమును దీసివేయుదురు; పొత్తములతో మనస్సును పాడుజేయుదురు.

2 (శివ):—ఎంతపాపము! వారి నీడను దాకినమాత్రమున పాపము పోవునని గురువులవా రనిరి. దానికిఁ గారణము దెలియునా ?

3 (శివ):—చెప్పు మేమో ?

2 (శివ):—దేవాసురులు సంద్రమును మథించి యమృతమును గొనిన పిమ్మట గొన్ని సుధాణువులు దివిజకుంభములనుండి భువికి నొలికెను. తదమృతసిక్తమృత్తికచే సృష్టింపబడె శివతారలోని ప్రథమపురుషుఁడు. ఇఁక నుత్తరకూటములోని తొలి మానిసియన్ననో, దేవతలు విడిచిన కుంభముల నచట నచట నంటియున్న సుధను రక్కసులు నాలుకలతో ననుభవించి యే మూలనో పారవైచిన ఆ పాత్రలు భిన్నభిన్నములాయె. అతఁడా ముక్కలతో గూర్పఁబడెను. అందుచేతనే వా రింతగట్టి. అబ్బా, యేమిరోత! ఎంతయశుచి?

3 (శివ):— ఇదంతయు నెక్కడ నేర్చితివయా?

2 (శివ):—మనగురువుగారినుండియే!

3 (శివ):— గురువరా! (గౌరవసూచకముగ శిరమువంచి) సత్యస్వరూపుఁడవు, నీ కీ సత్యమవు—

(ఉత్త: కూటవాసులగుంపు ప్రవేశము)

1 (ఉత్త):—కమ్మరియగు విభూతి రాజుచే క్షత్రియునిగఁ బరిగ్రహింపఁబడుట తప్ప, సర్వమును హాయిగ జరిగెను.

2 (ఉ త్త):—అది కేవలము గృహసంబంధమయిన విషయము. మున్ముందు దానిపని బట్టెదము. ప్రస్తుతము మంగళధ్యానము గావింతము. "ఆస్థానశిల్పి విభూతి చిరాయు నొందుగాత!"

3 (ఉ త్త):—క్షత్రియాయుధములతో వైశ్య సామగ్రి లనేకము చేసిన విభూతి! "విభూతికి చిరాయువగు గాక!"

1 (ఉ త్త):—అల్లదె! శివతారవాసులు కొందఱు.

2 (ఉ త్త):—నీకేమి గుర్తు?

1 (ఉ త్త):—చెవులగవ్వ కుళ్ళాయి లవిగో! ఎంత వికారముగ నున్నారు? నెత్తిపై నడచుటచే పెరుగుట మానిరా యన్నట్లున్నారు.

2 (ఉ త్త):—ఇట్టిరకముల కుళ్ళాయిలుండ వీ రిట్టిదాని నేల గ్రహించిరో? దేహమున చెవుల నుంచుట సృష్టికర్త తప్పిదమని యెంచియుందురా?

1 (ఉ త్త):—వారిలోని విలువయిన స్వల్పజ్ఞానము పైకి చమర్చిపోకుండ చెవులకు కట్టివేసిరి.

3 (ఉ త్త):—వెట్టిమొగమా, అటుగాదు! అంతకంటె, ప్రపంచ జ్ఞానము వారిలోనికిఁ బ్రవేశించి బాధింపకుండ జేయుటకయి యుండు.

1 (ఉ త్త):—ఉత్తరకూటపువారిఁ డెవఁడయిన చెవినులుపు ననుభయము వారి నావహించినది!

(అందఱును నవ్వుదురు.)

1 (ఉత్త):—ఓయీ! శివతారమూర్ఖులారా! ఏమి మీకథ?

3 (ఉత్త):—ఇది మా పండుగుదినమని యెఱుఁగరా? రండు, మాతోపాటు అరచుఁడు—"ఆస్థానశిల్పివిభూతికి చిరాయువగుగాత!"

1 (ఉత్త):—మీ గొంతుక లెండిపోయినవా యేమి? బిగ్గఱగా కేకవేయుఁడు. "విభూతికి చిరాయువు ప్రాప్తించుగాక!"

గణేశ:—"విభూతికి చిరాయు వగుగాత" మని మే మేల యరవవలెను? అతఁడే మొనర్చెను?

1 (ఉత్త):—అదే వినరయ్యా! "అతఁడేమొనర్చెను?" ఈఘనవార్త యింకను వారికి జేరనే లేదు. ఇదంతయు వారి కళ్ళాయిల మాహాత్మ్యము!

(ఉత్తరకూటవాసులు నవ్వుదురు.)

3 (ఉత్త):—అతఁడేమి చేసెనా! ఇదిగో! మీరు త్రాగుటకు నీ రాతని జేతిలో నున్నది! ఇఁక నేమి కావలె? దానివదలకున్న నీటి యెద్దడిలో కప్ప లెండిపోయినట్లు మీ రెండిపోదురు.

2 (శివ:)—మానీరు విభూతిచేతులలోనా? ఒక్కమారుగ నతఁడు దేవుఁడయి పోయెనా?

2 (ఉత్త):—పని నుండి దేవుని తొలఁగించెను. దేవునిపని కాతఁడే పూనుకొనును.

1 (శివ):—అతని పనితనమును జూప మచ్చున కేదయిన నున్నదా ?

1 (ఉత్త):—లేకేమి! ముక్తధార యడ్డు కట్టయే.

(శివతాఁవారును విఱుగఁబడి నవ్వుదురు)

2 (ఉత్త):—ఇది హాస్య మనుకొనుచున్నారా !

గణేశ:—ఏమి ! మరేమిటిది ! భైరవస్వామియే మా కొసఁగిన వరము నీ కమ్మరి వుడికి వేయుటా !

1 (ఉత్త):—అదిగో యాకసము మీఁద, నీకుఁ గనులు కనఁబడుట లేదా ?

2 (శివ):—శంకరా ! ఏమి యీ విపరీతము? అమ్మయ్యో !

3 (శివ) ఈశ్వరా! చుక్కల కేస మిడుతరూపమున దాఁటనున్న పెనుభూతమువలెనున్నది !

1 (ఉత్త):—తన కాళ్ళతో మీకు నీరందకుండ నాపునది యీ మిడుతయే !

గణేశ:—నీ యుపహాస్యము నింక కట్టివేయుము ; నే నూరకొనను. చాలు చాలు ! కొంతసేపూరకున్న, చందురు నందుకొన నీకమ్మరికొడుకు దీనిపై స్వారి చేయు నందువు!

(ఉత్త):—వాఁటోపీల మహాత్మ్యమది. వారుహింతము వినక నాశనమందుదురు.

1 (శివ):—మేము నాశన మందనొల్లము.

(ఉత్త):—శ్రావ్యముగా మాత్ర మున్నది! మిమ్ముల కాపాడు వారెవరి?

గణేశ:—మా స్వామి, మా బైరాగి ధనంజయుని నీవు చూడ లేదా? ఆయన శరీర మొకటి యాలయమున నున్నది, మరియొకటి వెలుపల నున్నది.

3 (ఉత్త):—వినుఁడు. చెవిటోపీలవాండ్రను వినుఁడు! వారి నధోగతినుండి యెవ్వరును దప్పింపలేరు.

(ఉత్తరకూటవాసులు పోవుదురు)

(ధనంజయుఁడు ప్రవేశము)

ధనం:—హీనమతులారా! యే మనుచుంటిరి? మిమ్ముల మృత్యువునుండి దప్పింప నాచే నున్నదా? అట్లేని, మీరు ముమ్మాటికిని మృతులే!

గణే:—విభూతి ముక్తధారాజలము నాపివేసెనని యుత్తర కూటస్థు లనిరి.

ధనం:—కట్ట నడ్డుగ గట్టి రనిరా?

గణేశ:—అవును బాబూ!

ధనం:—మీరు సరిగా వినలేదు!

గణేశ:—అది విన ప్రయోజనము లేనిదే! మీ చెవుల నన్నిఁటి నావద్దనే యిడితిరా? మీ యందరికొఱకు నేనె వినవలయునా?

3 (శివ):—వినుట కే మున్న దని, తండ్రీ!

ధనం:—ఆంతర్య మయినను, బాహ్య మయినను, తీవ్రశక్తిని వశపఱచుకొనుట స్వల్పవిషయమా?

గణే:—కావచ్చును; కాని దీని మాట? నీటిని—

ధనం:—అదివేఱు సంగతి. అట్లు జరుగ భైరవుఁ డెన్నఁటికి సైపఁడు. నేబోయి యీ యుదంతమును సాంతముగా దెలిసికొనవలయు. లోకములో ననేకు లనేకవిధములుగా జెప్పుచుందురు. వానిని వినకుండుట బ్రతుకకుండుటయే!

(ధనంజయుఁడు పోవును.)

(శివతారవాసుఁడు మఱియొకఁడు ప్రవేశము)

4 (శివ):—భీమణా, వార్తలేమి?

భీమణ:—శివతారనుండి యువరాజును తిరుగ రావించుకొనిరి.

అందఱు:—అసంభవము!

భీమణ:—మీరు చేసెడి దేమి?

అందఱు:—తిరుగ నాతని గొనిపోదుము.

భీమణ:—ఎట్లు?

అందఱు:—బలవంతమున.

భీమణ:—రా జూరకుండునా?

అందఱు:—అతని లక్ష్యపెట్టము.

(రణజిత్తు, మంత్రి ప్రవేశము)

రణ:—ఎవరినిరా, లక్ష్యపెట్టకపోవుట ?

అందఱు:—ఏలినవారికి చిరాయువగు గాత !

గణేశ:—మీకడ కొక విన్నపము జేయవచ్చితిమి.

రణ:—ఏమది ?

అందఱు:—యువరాజుగారు మాకె గావలె.

రణ:—మీ విన్నపము ముద్దుగా నున్నది; కోరిక స్వల్పము గానే యున్నది.

1 (శివ):—చిత్రము. శివతారకు మే మాతని తిరిగి గొంపో దుము.

రణ:—కొంపోయి యుత్సాహముతో పన్నుల గట్టుట మర చుటకా ?

అందఱు:—ఏమి జేతుము ? తిండిలేక మాడుచున్నాము.

రణ:—మీ నాయకుఁ డెక్కడ ?

2 (శివ):—(గణేశుని వైపుజూపుచు) ఇదుగో, మానాయకుఁ డు గణేశుఁడు.

రణ:—ఇతఁడు కాఁడు ! మీ బైరాగి యేఁడి ?

గణేశ:—అదే, వచ్చుచున్నారు.

(ధనంజయుఁడు ప్రవేశము.)

రణ:—వీరల మైమరువ జేసినవాఁడవు నీవు.

ధనం:—నిజమేనయ్యా! నేనుకూడ మైమరచియున్నాను.

రణ:—మాటకు మాట బదులు చెప్పకుము. దీనిని జెప్పుము. పన్నుల నీయుట నీ కిష్టమేనా?

ధనం:—లేదు! నిశ్చయముగా లేదు.

రణ:—నీవు పొగరుబోతువు.

ధనం:—నీది కానిదాని నీ కియ్యగూడదు.

రణ:—నాది కాదా?

ధనం:—మా క్షుధ తీరి మిగిలినదానిలో గొంత నీది. కాని మాక్షుధ తీరుటకు వలయునది నీది కానేరదు.

రణ:—నా పాలితుల నాకుఁ బన్నుల నీయకుండఁ జేతువా?

ధనం:—అవును; వారు పిఱికితనముచే, లోఁబడుటకు సిద్ధముగ నున్నారు. వారికి నే నుపదేశించున దేమనిన "ప్రాణదాతకే ప్రాణము నర్పింపుఁడు."

రణ:—ధైర్యమును చెప్పి వారి పిఱికితనమునకు బ్రిస్తుతోపశమనము గావించు చుంటివి; కాని యీ ధైర్యమున కావంత తూఁటుపడిన వారిభయము రెండింతలవేగముతో విచ్చుకొని వచ్చి వారి నశింపజేయును. నీ లలాటపట్టమున విపత్తు వ్రాయఁబడినది.

ధనం—ఆఁపట్టమును నా హృదయపీఠమునఁ జేర్చితిని. అచ్చట నుండూ గదా విపద్ప్రిహితుఁడు, భగవానుఁడు.

రణ:—(శివతారవాసులకు) మీ రందరు మీ పురమును జేరుఁడు; బైరాగి యిచ్చటనే యాగును.

అందరు:—వలదు, ఎంత మాత్రము వలను బడదు.

[ పా డు ను ]

గీ॥ ఆగు మంచును నీ వంత యరవనేల?
ఎంత నిర్బంధ పెట్టిన సుంతయైన
దాఁటజాలంగ నేర నీ ధర్మ మెపుడు
ఆగు నది యేదొ యది మాత్ర మాగగలదు॥

రాజా! నిర్బంధము వలన నీవు దానిని బొందలేవు సర్వప్రదుఁడే సర్వగ్రాహి. నీవు దురాశచే గ్రహింపఁజూచు నదియెల్ల తస్కరణమే. ఎన్నఁటికయిన దాని విడనాడ వలసినదే.

[ పా డు ను ]

గీ॥ ఈవు విధియించు శిక్షల హెచ్చుగాను
కఠినతయు మూర్ఖచిత్తంబు గానబడెడి;
అనుభవించెడు వాఁడొక్కఁ డగును సుమ్ము,
ఇచ్చవచ్చిన దాని సహించు నతఁడు॥

రాజా! బలము నుపయోగించి పొందిన యీ ప్రపంచము నీప్రపంచ మనుకొనుట తప్పిదము. నీవు దేనిని స్వేచ్ఛగా నుండనిత్తువో యది నీదే; కాని నీవు స్వాధీనము జేసికొన బ్రయత్నింపుము. నిన్నది తప్పించుకొనును.

(గాం ధు లు)

గీ॥ నీ మనోరాగమును బట్టి భూమి నెల్ల
నాట్యమాడింతు ననెడు స్వప్నంబునందు;
అట్టి కన్నుల దెరవంగ నరయగలవు
ఈ వెపుడు గోరినట్టి వవెన్నొ జరుగ.

రణ:—ప్రిథానీ! ఈ బైరాగిని చెఱసాల నుంపుము.

మంత్రి:— దేవరా,—(ఆగును)

రణ:—ఈ నా యాజ్ఞ నీ కిష్టముగ లేనటు లున్నది?

మంత్రి:—భీకర శిక్షాయంత్రము సిద్ధమయినది. దాని భయంకరత్వమును అతిశయింప బ్రియత్నింప నది తగ్గును.

శివతార:—దీని నెన్నటికి జరుగనీయము.

ధనం:—నన్ను విడువుఁడు; నామాట వినుఁడు! నన్ను విడిచి పొండు.

1 వ శివ:—యువరాజుగారిని కూడ మాకు లేకుండ జేసితిరే?

2 శివ:—మా కిద్దఱును లేకుండిన మాశక్తిని భరించువా రెవరు?

ధనం:—నే నజితుఁడను! నన్ను వెనుకకు పోనిందు?

అందఱు:—ఎందుచేతను. తండ్రీ?

ధనం:—నను పొందితిమని యానందించుటలో మిమ్ముల నే మీరు కోల్పోయితిరి. ఈనష్టమును గూడదీయుట నాతరముగాదు. నాకు సిగ్గుదెచ్చుచున్నారు.

1 శివ:—క్షమింపుఁడు! అటు లనకుఁడు! మీ యాప్సితము నెరవేర్తుము.

ధనం:—అటులయిన నన్ను విడిచి పొండు.

2 శివ:—మమ్ముల విడిచియుండుటకు మీ మనసొప్పునా? మమ్ముల బ్రేమింపవా?

ధనం:—ప్రేమచే మిము స్వాతంత్ర్యమం దుంచుట మేలా? ప్రేమచే మిము నలిమివేయుట మేలా? పొండు! నను విడిచి పొండు!

2 శివ:—సరే, బాబూ! మేము పోదుముగాని—

ధనం:—'కాని' యేమి! తల లెత్తుకొని బొండు.

అందరు:—చిత్తము, చిత్తము, ఇదే పోవుచున్నాము.

(మెల్లగ కదలిపోవు చుందురు.)

ధనం:—అదియేనా పోవుట! పొండు, వేగముగ బొండు.

గణే:—మీ యిష్టము. కాని మీ యూహాలు మీ యాశలు మిమ్ములనే యంటియుండునని నమ్ముఁడు.

(వారుపోదురు.)

రణ:—బైరాగీ, ఏమి నీ యోచన? అంత మౌన మేల?

ధనం:—రాజా, వారు నన్ను కలఁత బెట్టిరి.

రణ:—ఎందుకయి కలఁత?

ధనం:—మీ చండపాలుఁడే, దండముతోఁ జేయలేక పోయి నదాని నే జేసితినని భయపడుచున్నాను.

రణ:—అటు లనుకొనుటకు హేతువేమి ?

ధనం:—వారి యూహాలను యాశలను బలపఱచితినని తలంచి నాలోన గర్వించితిని; కాని యీరోజున నే వారియూహాలను యాశలను బెరుకుకొంటినని, చెప్పరీతి నామోమున గొట్టినట్లు ప్రవర్తించిరి.

రణ:—ఇదంతయు నెట్లు సంభవింపనయ్యెను ?

ధనం:—వారిని లేపిన గొలంది, వారిమనంబులు పరిపక్వస్థితిని బొందక మరింత క్షీణించుచున్నవి.

ధనం:—రభసావేశులనుగాం జేయుటచే జనుల ఋణభారము తగ్గింపలేము. వారి దేవునకంటెను నేను గొప్పవానినని వారినమ్మిక. అందుచే భగవంతునకు వారుసమర్పింప వలసిన విధిపూర్వక ఋణమును గొట్టివేయ గలనంట! ఆ నమ్మికతో వారు కనుల మూసికొని నన్నుబట్టుక వ్రేలాడుచున్నారు.

రణ:—నిన్నా, భగవంతుం డనుకొనుచుంట ?

ధనం:—కనుక నాయొద్దనే యాగిపోయి, దైవము నెన్నంటికిం జేరరు. వెలుపలినుండి వారిని బలవంత పెట్టుటచే నేను లోపలినుండి తిన్నగ నడిపించు భగవంతుని గప్పివుచ్చితి.

రణ:—రాజునకుం జెల్లింపవలసిన బన్నుల కట్టకుండ నాపుదువు; భగవంతున కర్పింపవలసిన దాని నీకొనంగిన నీవు నీ మనంబులో బాధ జెందకుందువా ?

ధనం:—సందియ మేమి ? బాధ పడుచునే యున్నాను. భూమి లోని కఱఁగి పోవుచున్నట్లున్నాను. వారు పూజల నన్నుఁటి నాకె యర్పించుటచే శూన్యమనస్కులయిరి. వారి ఋణ విముక్తులఁ జేయు బాధ్యత నా దగును; నే నట్టి బాధ్యత నుండి తప్పించుకొనలేను.

రణ:—ఇప్పు డేమిచేయుట ధర్మమని నీకు తోచును?

ధనం:—వారినుండి తొలఁగి దూరముగ నుండుట. వారిమనో స్వైరతకు నడ్డకట్ట నే గట్టుటయే నిజమయిన, మీ విభూతిని నన్నును నొక్కసారియె భైరవస్వామి శిక్షించునుగద.

రణ:—అయిన తడవేల? ముందునకు పోఁగూడదా (యుద్ధవునితో) ఈ బైరాగిని నాగుడారమునకుఁ గొంపోయి యుంచుటనుంచుము.

(యుద్ధవుఁడు ధనంజయుని గొంపోవును.)

రణ:—మంత్రీ! రక్షణగృహములోనికిఁ బోయి యభిజిత్తును జూడుము. పశ్చాత్తాప పడుచున్నటు లున్నయెడల—

మంత్రి:—స్వామీ, ఇంతకంటె బాగుండునది, మీరే స్వయముగ—

రణ:—ఏమి? ఏమి? వాఁడు స్వజనుల పట్లనే ద్రోహి. తన తప్పు నొప్పుకొనువఱకు వాని మొగము జూడను. నే నగరునకు మరలుచున్నాను. వార్త నచ్చుటకుఁ బంపుము.

(రాజా నిష్క్రమించును.)

(పాడుచు సన్న్యాసులు ప్రవేశింతురు)

(పాట)

తిమిర హృద్విదారణ
జ్వల దగ్ని నిదారుణ
మరు శ్మశాన సంచర
శంకర శంకర
వజ్రఘోష వాణీ
రుద్ర శూల పాణీ
మృత్యు సింధు సంతర
శంకర శంకర.

(వారు నిష్క్రమింతురు.)

# ముక్తధార.

(యుద్ధవ్రుఁడు పునః ప్రవేశము)

యుద్ధ:—ఏమిది? రాజుగారు యువరాజునుజూడ కుండ పోవుట!

మంత్రి:—తన మనోనిశ్చయమునకు భంగము వాటిల్లునని భయపడెను. ఆతనిమనం బీ సందిగ్ధస్థితి నుంటచేతనే బైరాగితో సంభాషణ సాగించుచుండెను. గుడారమును జొచ్చుటయా, గుడారమువదలి వచ్చుటయా యని నిశ్చయించు కొనలేక పోయెను. నేఁబోయి యువరాజును జూడవలెను.

(ఇద్దఱును పోదురు.)

(ఉత్తర కూటస్థులు కొందఱు ప్రవేశము)

1 ఉత్త:—మనము దృఢ చిత్తులమై యుండవలయు. రాజునొద్దకు బోవుదము రండు.

2 ఉత్త:—అటు జేసిన లాభమేమి? యువరాజాయనకు ప్రాణసముఁడు. ఆయన నెన్నఁటికి మనము గ్రహింపలేము. ఆయన మనపై యాగ్రహించును.

1 ఉత్త:—అయిన నేమి? మనమనంబుల నించుక యాతనికిఁ దెలియ జేయవలెను; పిమ్మట నేమి జరిగిన జరుగ నిమ్ము. యువరాజు మనపై ప్రేమ నింతచక్కఁగ వెల్లడిజేసినందుల

కిదియా ఫలము? ఉత్తరకూటముకంటె శివతారయే యుతని కెక్కుడు ముఖ్యమయినది కదా!

2 ఉత్త:—ఇదియే సంభవింపగల్గిన నీకు జగమున న్యాయము లేదు.

ఉత్త:—చూపునుబట్టి యేదీని నమ్మశక్యముగాదు.

1 ఉత్త:—రాజు జాతని శిక్షింపకపోయిన మనమే యటుచేయవలెను.

1 ఉత్త:—ఏమి సేతుము?

2 ఉత్త:—అతని నిప్పుల నుండిసేయుకూడదు. నందిలోయలో నతడు గావించిన మార్గముననే యాతని బంపివేయువలెను.

3 ఉత్త:—కాని బాబువా వ్రాసి యున్నది యేమనిన, ప్రస్తుత మాతడు శివతారలో లేడట. రాజసౌధములో మన మాతని జూడలేము.

1 ఉత్త:—మన కగపడకుండ నాతని రాజు తప్పక దాచివేయు చున్నాడు.

3 ఉత్త—అతని దాచెనా, నగరు గోడలు బడగొట్టి యాతని నీవల కీడ్చుకొనవలయును.

1 ఉత్త:—సౌధమున కగ్గి ముట్టింతము.

(మంత్రి యాయుద్ధకుడు ప్రవేశము)

1 ఉత్త:—[మంత్రితో] మాతోడ దాగుడుమూత లాడకుము! యువరాజు నీవలకు గొనిరా!

మంత్రి:—ఆతని నీవలకుఁ దెచ్చుటకు నే నెవరిని ?
2 ఉత్త:—అదియంతయు నీసలహామూలముననే జరిగియుండ
వలె! చూడు. నేఁ జెప్పుచున్నాను. అదంతయు పనికిరాదు!
దాగియున్న తావునుండి యాతని నీవల కీడ్చి తెత్తుము.
మంత్రి:—అటయిన, పరిపాలనాబాధ్యత మీరలే వహించి
ఆతని చెఱసాలనుండి వదలివేయుఁడు.
3 ఉత్త:—చెఱసాలనుండియా!
మంత్రి:—ఔను. రా జాతని చెఱఁబెట్టెను.
అందఱు:—రాజు చిరాయుష్మంతుఁ డగుగాక! ఉత్తరకూట
మునకు జయము జయము!
2 ఉత్త:—రండు చెఱసాలకు బోయి యచ్చట—
మంత్రి:—ఏమి ?
2 ఉత్త:—విభూతి పాఱవైచిన హారములోని పూలను పెఱికి
వైచి హారమును యువరాజు మెడను వేయుదుము.
మంత్రి:—దుర్గమును ఖండించుటచే యువరాజు దోషి యయ్యె
నని యనుచున్నారు గదా! అట్లే రాష్ట్రనిబంధనల మీ
రతిక్రమించుటలో దోషము లేదా!
2 ఉత్త:—కేవల మది వేఱు విషయము.
3 ఉత్త:—పోనిమ్ము! మేము నిబంధనల నతిక్రమించిన
మాత్ర మేమి ?
మంత్రి:— మీపాదముల క్రిందనున్న భూమిపై మీ కిష్టము

గాన, భూమ్యాకాశములమధ్య నున్న శూన్యప్రదేశము
లోనికి దుముకవచ్చును. కాని, యీ శూన్యప్రదేశమును
గూడ నిష్టపడరని నే నొక్క చెప్పగలను.

3 పౌర:—కనుక, మనము పోయి రాచనగరున కెదుట నిలు
వఁబడి 'రాజునకు చిరాయు వగుగాత' మని యఱచెదము.

1 ఉత్త:—అటు జూడు! సూర్యుఁడు గ్రుంకె; ఆకసమున చీకఁటి
పర్వుచున్నది. కాని విభూతి గావించిన యంత్రనిర్మాణ
మింకను మెఱయుచున్నది. సురాపానముచే నెఱ్ఱవడిన
చందమున దోఁచుచున్నది.

2 ఉత్త:—అస్తమింపనున్న వెలుతురుయొక్క తుదికిరణము,
ఆ త్రిశూలమునఁ నుద్వహింపఁ బడినది. అది యొక రీతి.
దాని వర్ణింపఁ జాలకున్నాను.

(ఉత్తరకూట వాసులు పోవుదురు.)

మంత్రి:—ఇప్పుడు తెలిసినది; తన విడిదిలోనే రాజు యువ
రాజును ఖయిదు చేసి యుండుటకుఁ గారణము.

యుధి:—ఏమి యా కారణము?

మంత్రి:—తన దేశపుఁ బ్రజలహస్తములనుండి తప్పించుటకు.
కాని, సర్వమును నరళిదప్పినట్లు కనఁబడుచున్నది. క్షణ
క్షణ మావేశ మతిశయించుచున్నది.

(సంజయుఁడు ప్రవేశము.)

సంజ:—నా యాత్రితను రాజునకుఁ జూప వెఱచుచున్నాను;

ఏల యన నాతనిసంకల్పము దానివలన నెక్కుడు దృఢ
పడునేమో.

మంత్రి:—రాజనందనా, నీ ప్రేరకయుండుటకు యత్నింపుము. ఇప్పుడున్న చిక్కులే చాలును. క్రొత్తవానిని తెచ్చిపెట్టకుము.

సంజ:—ప్రజలతో మాటాడఁబోతివి. వారు యువరాజును ప్రాణముకంటె నెక్కువ ప్రేమింతురని నే నెఱుఁగుదును. అతఁడు ఖయిదుననుంట వారు సహింపఁజాలరు. కాని, అతఁడు నందిద్వారము దెఱచెనను వార్త విని కోపానలదందహ్యమానులయినట్లు నే గుర్తించితి.

మంత్రి:—ఇట్టియెడల ఖయిదునుంచుటయే యాతనికి క్షేమదాయక మని యెంచవలెను.

సంజ:—బాల్యమునుండి నే నాతని నెల్లప్పుడు ననుసరించి యుంటి. ఖయిదులోనికిగూడ ననుసరించెద.

మంత్రి:—దానఁ బ్రయోజన మేమి?

సంజ:—ఒక్కొక్కఁడును తనంతట దా నర్థమానవుఁడే. అన్యునొకని దృఢముగాఁ జేరినపుడే యాతఁడు సంపూర్ణత గనును. యువరాజును జేరుటలో రాజు సాంగత్యమున సంపూర్ణత గంటిని.

మంత్రి:—ఇట్టిపొందు యథార్థ సాంగత్య మయిన పట్టున, కేవల బాహ్య సమావేశ మనవసరము. అంబరమునందలి

యంబుదమును, అంబుధియందలి యంబువును యథార్థ
ముచే నొకటియ: అవెంతదూరమున నున్ననేమి? యువ
రాజు లేని తావుల నీ మూలమున నాతఁడు విదితము కా
వలసియున్నాఁడు.

సంజ:—ఇవి నీ సొంత పలుకులవలె దోఁచవు. యువరాజు మా
టలవలె విన నగుచున్నవి.

మంత్రి:—ఇచ్చట గాలియం దెల్లెడల వాని మాటలే! వానిని
వాడుచున్నాము గాని, యయ్యవి వానిపలుకులని మఱచుచు
న్నాము.

సంజ:—బాగుగ జ్ఞప్తికిఁ దెచ్చితివి! దూరమున నుండి వాని
సేవించెదను, ఇప్పుడు రాజుకడ కేగెద.

మంత్రి:—ఎందునకు?

సంజ:—శివతారపరిభుత్వమును నా కొసఁగుమని రాజు
నడిగెద.

మంత్రి:—కాలము విషమించి యున్నది కద.

సంజ:—కనుకనె యిది యుత్తమ తరుణము.

[ఇద్దరును నిష్క్రమింతురు]

(రాజపినతండ్రి యగు విశ్వజిత్తు ప్రవేశము)

విశ్వ:—ఎవరక్కడ? యుద్ధవా!

యుద్ధ:—స్వామీ!

విశ్వ:—చీఁకటిపడుటకయి వేచియుంటి. నాజాబు చేరెనా?

యుద్ధ:—చిత్తము.

విశ్వ:—నా సలహా ననుసరించితివా ?

యుద్ధ:—స్వల్పకాలములో నీ వెఱుఁగఁగలవు. కాని—

విశ్వ:—నీమనంబున ననుమానము మానుము. ఆతని విడచుటకు రాజు సిద్ధపడి యుండలేదు. కాని, యేదేని యోగవశమున, రాజున కెఱుక బడకుండ నెవరయిన విడుదల గావించిన, రాజుప్రాణము చాలవఱకు కుదుటఁ బడును.

యుద్ధ:—కాని, అట్లుచేసిన వానిని రా జెప్పటికిని క్షమింపఁడు.

విశ్వ:—నా సైనికులు నిన్నును, నీరక్షకులను బట్టుదురు. ఆబాధ్యత నాది.

[బయటనుండి కేకలు;—అగ్ని ! అగ్ని ! ]

యుద్ధ:—అల్లదిగో ! రక్షకులుండు గదియొద్ద నున్న వంటలు జేయు గుడారమున కగ్గి నంటించిరి. ధనంజయుని యువరాజును కారాగారవిముక్తులఁ జేయుట కిదియ యదను.

[అతఁడు పోవును; కొంతసేపటికి అభిజిత్తు ప్రవేశము]

అభి:—(విశ్వజిత్తుతో) ఇక్కడనుంటి వేల ?

విశ్వ:—నిన్నుఁ బట్టుకొన వచ్చియుంటి. నీవు మోహనగిరికి రావలసియున్నది.

అభి:—నేఁడు నన్నేదియు జెఱనుంచలేదు—ఆగ్రహము కానిమ్ము, అనుగ్రహము కానిమ్ము. గుడారమునకు నిప్పు నంటించిన వారలు మీరసికదా మీ యూహ ? అట్లు కాదు ! ఈ

యగ్ని నాకై వేచియున్నది. చెఱసాలయం దుండుటకు గడువు నాకు లేక పోయెను.

విశ్వ:—ఏమి, నాయనా! నీవు చేయవలసిన పని యేమి?

అభి:—నాపుట్టువుతోడఁ బ్రాప్తించిన ఋణమును నేఁ దీర్చవలెను. ముక్తధారాప్రవాహము నన్ను పుట్టుకతోడన దాదివలెఁ బెంచినది; దానికి నే స్వేచ్ఛ నొసఁగవలెను.

విశ్వ:—ఈ దినమున గాదు. అట్లు చేయుటకు కావలసినంత కాల మున్నది.

అభి:—నాకు దెలిసిన దిది. అట్టికాలము తిరిగి ఎన్నడు వచ్చునో యెవ రెఱుఁగుదురు?

విశ్వ:—మేమును నిన్నుఁ జేరెదము.

అభి:—కాదు; ఆకృత్యము నేఁ జేయవలసినది; మీ కందు సంబంధము లేదు.

విశ్వ:—నిన్నుఁ బ్రేమించు శివతారవాసు లీ పనియందు నీకుఁ దోడ్పడ నుద్యుక్తులై యున్నారు.— అట్టివారిని నీ చెంతకుఁ బిలువవా?

అభి:—నాకు వచ్చినసందేశము వారికిని వచ్చినయెడల నాకయి కనిపెట్టుకొని కూరుచుండరు. నాసందేశము వారిని తప్పుదోవను బడఁజేయును.

విశ్వ:—చీఁకటిబడుచున్నది, నాయనా!

అభి:—స్వర్గదేశము వచ్చినదిశనుండి వెలుతురు వచ్చుచున్నది.

విశ్వ:—నీపథమునుండి నిన్ను ద్రిప్పశక్తి నాకు లేదు. నీ వంధకారమున నిమగ్నుఁడ వగుచున్నను, దేవుఁడు నిన్ను సరిగ నడిపించునని నమ్ముచున్నాను. నిన్ను భగవంతుని చేతులలో విడచెదను. ఆశాభరితమగు నొక్క నుడువును నా చెవిఁ బడవేయుము. తిరిగి మనము కలసికొందు మను మాట చెప్పుము.

అభి:—ఒక్కటి జ్ఞాపకముంచుకొనుము; మన మెప్పటికిని వేఱు పడఁజాలము.

[వా రెదురు దిశల బోవుదురు]

# ముక్తధార.

[వటుఁడు, ధనంజయుఁడు ప్రవేశము.]

వటు:—తండ్రీ, దిన మంతమయినది; చీఁకటి గ్రమ్ముచున్నది.

ధనం:—తనయా, మన వెలుపలి వెల్తురు నాధారము చేసికొని యుండుటకు మన మలవడితిమి? అందుచే చీఁకటిబడినపుడు మనము కానలేకున్నాము.

వటు:—భైరవస్వామి యీదినమున నృత్యముఁ జేయఁ బ్రారంభించునని తలఁచియుంటిని. కాని శిల్పియగు విభూతి తన యంత్రముచే నాయనకాలు సేతులఁ గట్టివేసెనా యేమి?

ధనం:—భైరవుఁడు నృత్యముఁ జేయఁ బ్రారంభించునది మన కగోచరము. అది యంతమొందునపుడే ప్రకటితమగును.

వటు:—మాకు ధైర్యముఁ జెప్పుము, గురూత్తమా! మాకు భయమగుచున్నది! మేల్కొనుము, భైరవా! మేల్కొనుము! వెలుతురు పోయినది! దారి కాన్పించుట లేదు! ప్రతివచనము వినఁబడకున్నది! ప్రాణవినాశక! ఇంకను భీకరతరమయిన దానిచే మాభయము నశింపఁజేయుము!

భైరవా, మేల్కాంచుము! మేల్కాంచుము! (వెళ్లును.)

[ఉత్తరకూటపు జనులు ప్రవేశము.]

1 ఉత్త:—అబద్ధము! ఆతఁడు చెఱసాలలో లేఁడు! వారెక్కడనో యాతని దాఁచియుంచిరి.

2 ఉత్త:—వారెట్లు దాఁచ గల్గుదురో చూతము.

ధనంజ:—లేదు, లేదు! వారెన్నఁటికిని దాఁచి యుండలేరు.
గోడలు విరిగిపడును; ద్వారము ముక్కలయిపోవును.
చీఁకటికోణములోనికి వెలుతురు చొచ్చును; సర్వమును
స్పష్టపడును.

1 ఉత్త:—ఎవరిది? నన్నింత భయపెట్టినాఁడు?

3 ఉత్త:—ఇది యెంతయు బాగుగ నున్నది! మన మెవరినో
యొకరిని హింసింపవలెను. ఈ బైరాగి బాగుగ బనికి
వచ్చును. ఆతని బంధింతము!

ధనంజ:—ఎప్పుడును తనకుఁదానె వశుఁడై యున్నవానినిబట్టుట
వలనఁ బ్రయోజన మేమి?

1 ఉత్త:—నీ వైరాగ్యమును వెనుకఁ బెట్టుము. మేము నీ యను
చరులము గాము.

ధనం:—మీ రదృష్టవంతులు! గురువు ననుసరించి గురువును
గోల్పోయిన నిర్భాగ్యులను గొందఱ నే నెఱుఁగుదును.

1 ఉత్త:—ఎవరు, వారి గురువు?

ధనం:—ఎవనివలన వారు దెబ్బలఁ గొనుచున్నారో, యతఁడే
నిజమయిన గురువు.

(అర్చకులు పాడుచుఁ బ్రవేశింతురు.)

తిమిర హృద్విదారణ

జ్వల దగ్ని విదారుణ

మరుశ్మశాన సంచర
శంకర శంకర
వజ్రఘోషవాణీ
రుద్రశూలపాణీ
మృత్యుసింధు సంతర
శంకర శంకర.

3 ఉత్త:—అటు జూడుము! దానికేసి చూడుము! చీఁకటి పడు కొలఁదిని యంత్రము నల్లగఁ గనుపడుచున్నది.

1 ఉత్త:—పగటివేళ నినదీప్తినిమించ సమకట్టినది; ఇప్పుడు నలుపుదనమున చీఁకటిని జయింపఁజూచుచున్నది.

అది యొక భూతమువలె నున్నది!

2 ఉత్త:—విభూతి దాని నా మాదిరిగ నేల కట్టెనో బోధపడకున్నది. ఊర నెక్కడ నున్నను మనము దీనిఁజూడకుండ లేము. ఆకాశమునుభేదించు ఆర్తనాదమువలె నున్నదది.

[నాలవపురవాసి ప్రవేశము]

4 ఉత్త:—చెఱసాలను గాచియున్న రక్షకులతోఁగూడ యువరాజును రాజుపినతండ్రి బలవంతమున తీసికొనిపోయెను.

1 ఉత్త:—దాని యభిప్రాయమేమి?

3 ఉత్త:—ఉత్తరకూటస్థుల శోణితము వాని నాడుల బ్రవహించుట సూచించును. రాజు తగిన రీతిని యువరాజును శిక్షింపఁడేమో యను భయముచే నాతఁడిట్లు చేసియుండును.

1 ఉత్త:—ఎంత ఘోరము; ఒక్కపరి యోజింపుఁడు! మన యువరాజును శిక్షించుటకు మనకుఁగలహక్కు నతఁడు స్వీకరించుటయా!

2 ఉత్త:—మిత్రమా! దీనికిఁ దగిన పని యేమనిన—నీకుఁ దెలిసినదా?

1 ఉత్త:—ఆఁ, అవును! అతని రాష్ట్రములో నున్న సువర్ణ ఖని—

3 ఉత్త:—అతని కొట్టములో కనీసము యేఁబది వేల పశువు లున్నవని నమ్మకమయిన తావునుండి వింటిని. ప్రతిపశు వును నొక్కటొకటిగ నెంచి వానిని స్వాధీన పఱచు కొనెదము. ఎంత దుర్భరము!

4 ఉత్త:—అదియుంగాక, యతనికి కాశ్మీరవనమునుండి వచ్చు సంవత్సరాదాయము అధమ పక్షము—

2 ఉత్త:—అవు నవును! వానిరాష్ట్రముచే దానిఁ గ్రక్కించ వలెను: ఎంతటి తిరస్కారము!

1 ఉత్త:—రండు! రాజున కీ విషయముం గూర్చి తెలియఁ జేయుదము.

[అందరును నిష్క్రమింతురు]

[ఒక పాంథు డఱచుచుఁ బ్రవేశించును]

మొదటి పాంథుడు—బుడా! శంభూ! బుడా—ఆహ!

శంభూ:—ఊఁ—ఊఁ— అబ్బ! ప్రాణము విసికిపోవుచున్నది! అడ్డ

త్రోవను వచ్చి నన్ను గలసికొందుమని చెప్పుచు వారు నన్ను ముందుగ బంపిరి. కాని వారిజాడయే లేదు—(పైకిఁ జూచుచు) అమ్మయ్యో! ఆ పైని నల్లని యినుప పిశాచము! నన్నుఁ జూచి వెక్కిరించుచున్నది! నన్ను భయ కంపితు నిగఁ జేయుచున్నదే!

[మఱియొక పాంథుఁడు ప్రవేశము]

ఎవరచట? పలుక వేల? బుడాక్!

రెండవపాంథుడు:—నన్ను నిముకుఁడందురు; ప్రమిదల నమ్ము వాఁడ. నేఁడు రాజధానియందు రేయంతయు నుత్సవము గాన ప్రమిదలు కావలసి యుండును. నీ వెవరవు?

మొదటిపాం:—నా పేరు హుబ్బా. గ్రామముల వెంబడి సంచారముచేయు వేషగాండ్ర మేళములోని వాఁడను. నీ త్రోవలో మా మేళమును జూచితివా? 'ఆంబు' అను మా నాయకుఁ డగపడెనా?

నిముకుఁడు:—ప్రజలు తండోపతండములుగ వచ్చుచున్నారు, వాని గుర్తింప నా కెట్లు సాధ్యము?

హుబ్బా:—మా ఆంబు సాధారణుఁడు కాఁడు. కేవలము సంపూర్ణ మానవుఁడు. గుంపులో నతని నానవాలు బట్టుటకు సులోచనము లవసరము లేదు. ఆతఁడు ఘునియ యను కొంటివా? కాదు, కాదు—ఏమోయి! నీయొద్ద గంపలో నెంత ప్రమిదల సరకున్నది? నా కొక్కటీయవా? ఇంట

నున్నవారి కంటె వీధినున్న వారికి దీపపు టవసర మెక్కువ!

నిముకుఁడు:—ఎంత విలువ నిచ్చెదవు?

హుబ్బా:—ఇయ్యి గలిగి యున్నయెడల, నిన్ను బిగ్గరగ నా జ్ఞాపించి యుందును గాని, నా కోమల గాత్రమును నీపై వ్యర్థపుత్తునా!

నిముకుఁడు:—హాస్యగానివలె నున్నావే!

[పోవును]

హుబ్బా:—ప్రిమిదను బుచ్చుకొనలేక పోతిని గాని హాస్యగాఁడ నని ఘనత గాంచితి. ఇదియును గొంతమేలే! చీఁకటిలో నయిన గుర్తింపఁ జేయు చతురత హాస్యగాండ్రకు గలదు. ఈ చిమ్మెటల గోలవలన నెంత బాధ! అంబర శరీరాంగమున సూదులుండి వానికి వినబడు శక్తిగూడ గలుగుట తోఁచుచున్నది!

నా హాస్యమును బ్రకటించుట కంటె నా ప్రమిదల నమ్ము వానిపై నాబలమును వినియోగించిన నెంత బాగుండును.

(దండు గూర్చువాఁడొకఁడు ప్రవేశము.)

దండుగూర్చువాఁడు:—లెండు! లే లెండు.

హుబ్బా:—అయ్యో కర్మమా! నీవు వచ్చి నన్నిట్లు బెదరించెద వేలనయా?

దండు:—బయలు దేరుటకు సిద్ధపడుము!

హుబ్బా:—మిత్రమా, సరిగా నాయుద్దేశము నదియే. ముం దుకు బోవ యత్నించునపు డొకచోట దగులు కొనుటను గూర్చిన పాఠమును నెమరునకు దెచ్చికొనుచున్నాను.

దండు:—నీ దండులోనివారు సిద్ధముగ నున్నారు. నీ వొక్క డవే తక్కువ.

హుబ్బా:—ఏమంటివి? స్పష్టముగా నర్థముగాని మాటల నవ గాహన జేసికొనుటలో నుపద్రవు తెలివి కొన్నాలము మేము. దీక్షా మోహనపు వారము. 'నా' దండు అనుటలో నీ యభిప్రాయమేమి?

దండు:—మాటలవలన గాక, ఇతర మార్గముల మా యభి ప్రాయమును స్పష్ట పఱచుటలో నద్భుత చాతుర్యము నొందితిమి మేము. బాబువా వారము. (ఒక్క త్రోపు త్రోయును) ఇప్పుడు తెలిసినదా?

హుబ్బా:—ఆఁ! ఔను! దీని యర్థము పూర్తిమములో నేమ నిన, నేబోయి తీరవలెను, ఇష్టమయినను, కాక పోయినను కాని, ఎక్కడకో? దయచేసి మీ జవాబు నీపర్యాయము కొంచె మెక్కువ చెమ్మదిగా నిండు. మీ మొదటి మా టలత్రోపు నా మనస్సును చాలవఱకు నిర్మలము గావిం చినది.

దండు:—నీవు శివతారకుఁ బోవలసి యున్నది.

హుబ్బా:—శివతారకే! ఈచీకటి రేయినా! అక్కడియాట యేకథను?

దండు:—ఏ కథనా? నందిద్వార దుర్గమును తిరిగి కట్టుట.

హుబ్బా:—నా సాయముచే దుర్గమును దిరుగ కట్టనెంచితివా? అయ్యో మిత్రమా, ఈ యంధకారమున నాపై నీదృష్టి సరిగ నానకుంట చేతనే నీ విట్టి యసంభవము నుచ్చరించితివి! నేను—

దండు:—నీ వెవరయిన నా కేమి? నీకు రెండు చేతులున్నవి.

హుబ్బా:—అందుకు నేనేమియు చేయలేక పోతిని, కాని వీని ననుట—

దండు:—నీచేతు లుపయోగపడునని నిర్ధారణ నీ నోటివెంబడి రాదు. సమయము వచ్చినపుడు మేమె కనుగొందుము. ఇంకరమ్ము లెమ్ము.

(వెంటు కూర్చువాడెక నొకడు ప్రవేశము)

2 దండు:—ఇచట నింకొకడున్నాడు. కంకరా.

కంకరుడు:—ఎవడువాడు?

పాంథుడు:—నే నెవరను కానయ్యా! నా పేరు లక్ష్మణుడు. భైరవాలయములో జయఘంట మోగించువాడను.

కంకరుడు:—అటయిన నీ చేతులు గట్టివే. శివతారకు రమ్ము!

లక్ష్మ:—అయితే ఘంటమాట?

కంక:—భైరవుడు తనఘంటను తానె మోగించుకొనును.

లక్ష్మ:—మొ్రొక్కెదను! నన్ను దయనుజూడుఁడు! నాభార్యకు జబ్బుగానున్నది.

కంక:—నీవు లేకున్ననేమి? ఆమెజబ్బు కుదురును; లేకున్న నామె మృతినొందును. నీవింటనున్నను నదియే జరుగును.

హుబ్బా:—ఓయి వెఱ్ఱివాఁడా, లక్ష్మణా! గడబిడ చేయకుము. పనిలో ప్రమాదము లేకపోలేదు. నేనెఱుఁగుదును. కాని నీవు దాని కడ్డుజెప్పుటలోకూడ ప్రమాదమున్నది; అప్పుడే నేను దాని కొంత రుచిచూచితిని.

కంకర:—అదిగో వినుము! నరసింగునిమాటవలె నున్నది.

[గుంపులో నరసింగుఁడు ప్రవేశము.]

కంకర:—శుభ మేనా వర్తమానము? నరసింగా!

నరసింగు:—మనపనికై వీరిని పోఁగుజేసితిని. మరికొంతమంది నప్పుడే పంపివేసితి.

గుంపులో నొకఁడు:—నేను వెళ్ళను.

కంకర:—ఏల? నీ యసందర్భ మేమి?

ఒకడు:—ఏమియు లేదు. కాని నే వెళ్ళుటలేదు.

కంకర:—వీనిపేరేమి? నరసింగా!

నరసింగు:—ఈతనిపేరు వనవారి. తామరగింజలనుండి జపము నకై పూసలఁ జేయును.

కంకర:—వానిసంగతి నేను కనుగొననిమ్ము (వనవారితో) నీకేల వెళ్ళుట కిష్టములేదు!

వనవారి:—శివతారవాసులతో నాకు కలహములేదు. వారు మనకు విరోధులు కారు.

శంకర:—కాని, మనమే వారి విరోధుల మనుకొనుము! దానిలో మాత్రము మనకు బాధ్యతలేదా?

వనవారి:—ద్రోహముఁ జేయుటలోఁ బాల్గొనుట నా కసహ్యము!

శంకర:—న్యాయ నిరూపణ స్వాతంత్ర్యము నీకున్నగదా తప్పు తప్పు కాఁగలదు. ఉత్తరకూటస్థు లెల్లరును నొక గొప్ప సంఘము. అందు నీవొక భాగము. సంఘములో నొకఁడ వగుటచే నీ వేమి చేసినను, దానికి నీవు బాధ్యుఁడవు కావు.

వనవారి:—అంతకంటె గొప్పసంఘమొకటి యున్నది అందు ఉత్తరకూటము శివతారయుగూడ భాగములే.

శంకర:—ఓయి, నరసింగా! వీఁడు వాదించుచున్నాఁడే! వాదించువానికంటె దేశమున కరిష్టకారి లేఁడు!

నరసింగ:—కఠినమైనపని చేయించుటయే దానికి మందు! అందుచేతనే వానిని మాతో గొనిపోవుచుండుట.

వనవారి:—నా వలన మీకు శ్రమయే కాని, మీపనికి నే నేమియు నుపయోగించను.

శంకర:—నీ వుత్తర కూటమునకే శ్రమ నిచ్చుచున్నావు అందుచే నిన్ను వదల్చుకొనఁ జూచుచున్నాము.

హుబ్బా:—ఓయి బన్వారీ, ప్రియ మిత్రమా! నీవు వివేచన ముగలట్టి వారి తెగలోని వాఁడవు వలె నున్నావు; బలవంతు లగు వారి తెగ యొకటి గలదని నీవు గమనింప కున్నావు. ఈ రెండు తెగలకును పొసఁగ కుండును! వారి పద్ధతిని నీవు నేర్చి కొనవలెను, లేక నీ పద్ధతిని విడచి యూరకుండ వలెను.

వనవారి:—నీ పద్ధతి యేమి?

హుబ్బా:—నాకు పాట పాడుట వేడుక. కాని అది యిప్పుడు నిరుపయోగమని యూరకే యున్నాను.

కంకర:—(వనవారితో) ఈ సందర్భమున నీ వేమి చేయుదువో తెలుపుము.

వనవారి:—ఇఁక నొక అడుగయినను ముందు వేయను.

కంకరు:—హెూ, ఆలాగునా! అయిన మే మే నిన్ను కదలునట్లు చేయుదుము. ఎవరక్కడ! వీని నీ త్రాటితో గట్టి వేయుఁడు.

హుబ్బా:—(అడ్డువచ్చి) అయ్యో, అయ్యా! దయచేసి నా దొక మాట వినుఁడు, నాపైఁ గినియకుఁడు! ఈతని మోసికొని పోవుటకు వృథ పఱచ వలసిన శక్తిని బాగుగ వినియోగించుటకు వీలు గలదు.

కంకర:—ఉత్తరకూటమును సేవింప నిష్టపడనివారియెడ మేము గావింప వలసిన కఠిన ధర్మము గలదు; దాని నసడ్డ చేయఁజాలము. తెలిసినదా?

హుబ్బా:—ఆఁ, ఆలాగునా! చాలు బాగుగ తెలిసె!

(నరసింగు, శంకరుఁడు, తప్ప మిగిలిన వారెల్లరు నిష్క్రమింతురు)

నరసింగు:—ఇదిగో! విభూతి వచ్చుచున్నాఁడు. అతఁడు చిరాయువు నొందుగాక!

(విభూతి ప్రవేశము)

శంకరుఁడు:— మేము చాల వఱకు పని జేసితిమి, మాగుంపునందలి పనివాండ్ర సంఖ్య హెచ్చినది. నీ విచ్చటేల నుంటివి? నీకై యుత్సవముయొద్ద నందఱు నెదురు చూచుచున్నారు.

విభూతి:— ఈయుత్సవము నా కేమియు నిష్టము లేదు.

నరసింగు:—ఏల?

విభూతి:— నన్ను ఆహ్వానించుటలో నా కగు గౌరవమును తగ్గించుటకయి యుద్దేశించినట్లుగ నేఁడే నందిద్వారపు సమాచారము తెలుపఁబడినది. నాపై కక్షగలదు కొందఱకు,

శంకరుఁడు:—కక్ష యెవరికి?

విభూతి:—వాని పేరును ఉచ్చరింప నా కిష్టము లేదు. వాని పేరు మీరందఱెఱిఁగినదే. నాకంటె నెక్కుడు గౌరవమును బొందవలెనని మిక్కిలి తల్లడిల్లుచున్నవాఁ డతఁడు. ఇంకను నీకొక విషయముఁ జెప్పలేదు. నన్ను మోసము చేయుటకు అన్యపక్షమునుండి యొక వార్తావహుఁడు నాయొద్దకు వచ్చెను. కట్టను బడగొట్టుటకు నంసిద్ధులయి యున్నారని కూడ సూచించెను.

నరసింగు:—ఏమి పొగరు!

కంకరు:—దాని నెట్లు సహింప గలిగితివి, విభూతి ?

విభూతి:—పిచ్చి యఱవుల పాటింప నేల?

కంకరు:—వాని పాటింపక నిర్భయముగా నుంట మంచిదా ? నీ వొకప్పుడు చెప్పినది నాకు జ్ఞాపక మున్నది. కట్ట యొకటి రెండుచోట్ల బలహీనముగా నున్నదనియు, ఆచోట్ల సులభముగ—

విభూతి:—ఈ చోటుల విషయమయి తెలిసినవారి కింకొక విషయము తెలియక పోదు; ఆ చోటుల చేయివైచిన ప్రవాహములోఁ బడి వారును గొట్టుక పోదురు.

నరసింగు:—అస్థలములయందు రక్షక భటుల నుంచుట యుచితము గాదా?

విభూతి:—మృత్యుదేవతయే వాని గాచుచున్నది. నే గట్టిన కట్ట కేమాత్రమును భయములేదు. నందీద్వారమును ఇఁక నొక్కసారి బంధించితినేని, నాజీవితేప్సిత మీడేరును; సంతోషముగ ప్రాణముల విడువ గలుగుదు.

కంకరు:—దానిం జేయుట నీ కేపాటిపని?

విభూతి:—పనిముట్లు సిద్ధపఱచి యుంచితి. ద్వారము మాత్రము కడు సన్నముగా నున్నది; కొలఁదిమంది మనుష్యులయినను దానిం గాపాడుకొన గలరు.

కంకరు:—అటులయిన, మృత్యుప్రవాతఁబడువారు కావలెన న్నమాట.

[తెరవెనుకనుండి ధ్వని]

లెమ్ము. భైరవా. లెమ్ము.

[ధనంజయుఁడు ప్రవేశము]

కంకరు:—సాహస కృత్యమునకు పోనైయున్న యిట్టి తరుణమున మన కిది యొక దుశ్శకునము.

విభూతి:—బైరాగీ, నీవంటి సన్యాసు లిదివఱ కెన్నఁడును భైరవుని మేల్కొలుపలేక పోయిరి. కాని నీవు భక్తిహీను లనెడి నావంటిమనుజులు భైరవునిగట్టిగ లేపఁబోనున్నారు.

ధనం:—ఆయనను లేపుట మీకుఁ గాదని నే నెవ్వ డనుకొన లేదు.

విభూతి:—మేము మేల్కొలుపు పద్ధతి జయఘంటల మ్రోగించుటయు దీపముల వెలిగించుటయు కాదు.

ధనం:—కాదు! మీ రాయనను సంకెలలతో బంధించినపుడు వానిని త్రెంపివేయుటకు మేల్కొనును.

విభూ:—మేము వేయు సంకెలలఁ ద్రెంప సులభము గాదు, పాపములు లెక్క లేకుండ నున్నవి; అట్లే సంకెలల ముళ్ళును లెక్కలేనన్ని గలవు.

ధనం:—ఆటంకము దాఁట నశక్య మయినపుడు, అతఁడు లేవ సమయము వచ్చును.

(దైవభక్తులు పాడుచు ప్రవేశింతురు.)

( పాట )

జయ భైరవ జయ శంకర.
జయ జయ జయ ప్రళయంకర
శంకర శంకర.

జయ సంశయ భేదన
జయ బంధన ఛేదన
జయ సంకట సంహార
శంకర శంకర.

మంత్రి:—దేవా! మన విడిది నిర్మానుష్య మైనది; అందు చాలభాగము దగ్ధమైనది. అచ్చట నుండిన కొలఁదిమంది భటులును—

రణ:—వారి మాట కేమి; అభిజిత్తు ఎక్కడ? మాకు తెలిసి తీరవలెను.

శంకర:—దేవా! యువరాజు విషయములో మేము మీశిక్షకుఁ బాత్రులమని ఒప్పుకొను చున్నాము.

రణ:—దండనార్హుని శిక్షించుటకై మీ సమ్మతికి నే వేచి యుండనేల?

శంకరు:—ఆతని నెచ్చటను కాన లేనపుడు ప్రజలు వారి మనంబుల ననుమానింతురు.

రణ:—అనుమానమా? ఎవరిపైన?

కంకర:—క్షమింపుఁడు; దేవా! యుష్మత్పాలితుల మనస్స్థితిని తమ రెఱుంగవలెను. యువరాజును శీఘ్రముగా కనుఁగొనని హేతువుచే వారు మిక్కిలి యాతురతఁజెంది, అతఁడు కనఁబడిన యెడల మీ తీర్పుకై వేచియుండన ట్లుండిరి.

విభూతి:—మా యంతట మేమె నందిదుర్గమును గట్టఁబూనుకొంటిమి.

రణ:—ఆపనిని నాకయి యేల విడువలేదు?

విభూతి:—యువరాజు గావించిన యీదారుణకృత్యమునకు మీరు రహస్యముగ నుత్తరువు పాలించితిరని మే మనుమానింప మా కధికారము గలదు.

మంత్రి:—అయ్యా! ఒక దెస స్వోత్కర్షచేతను ఇఁక నొక దెస కోపాటోపముచేతను ప్రజల మనంబు కలఁతఁజెందినది. నీయాతురత వలన వారి యాతురతను వృద్ధిజేసి దాని యుద్రేకమును మఱింత పెంపు జేయకుము.

రణ:—ఎవరక్కడ? ధనంజయుఁడా?

ధనం:—తమరు నన్ను మఱచిపోనందులకు సంతసించు చున్నాను.

రణ:—అభిజిత్తు ఎచట నున్నాఁడో నీవు నిశ్చయముగ నెఱుఁగుదువు.

ధనం:—నాకు యథార్థముగఁ దెలిసిన దాని నేను రహస్యముగ నుంచను.

రణ:—అయిన నీ విచట నేమిచేయుచున్నావు?

ధనం:—యువరాజు దర్శనమునకై వేచియున్నాను.

(బయటనుండి అంబగొంతుక వినబడును.)

సుమనా! సుమనా! నాకూనా! చీఁకటిపడినది! కాఱుగ మ్మినది!

రణ:—ఎవరా పిలుచుచున్నవారు?

మంత్రి:— అది యాపిచ్చిమానిసి యంబ.

[అంబ ప్రవేశము]

అంబ:—వాఁడింకను తిరిగి రాలేదు.

రణ:—నీ వాతని నేల వెదకెదవు? కాలము వచ్చియుండె; భైరవుఁడు పిలుచుకొనిపోయెను.

అంబ:—భైరవుఁడు పిలుచుకొనిపోవుటయేనా? ఎన్నఁటికిని తిరుగ బంపరా—రహస్యముగా నయిన? నిశీథమందయిన? నా సుమనా!

[అంబ నిష్క్రమించును]

[వార్తావహుఁడు ప్రవేశము]

వార్తా:—శివతారనుండి జనసమూహ మొకటి దాడి వచ్చుచున్నది.

విభూతి:—అదెట్లు సంభవించె? ఆకస్మికముగా వారిపైఁ బడి వారిని నిరాయుధులుగఁ జేయ నుపాయము వన్నితిమి. మనలో ఎవఁడైన నొక ద్రోహి యుండనోవు! కంకరా నీ గుంపులోనివారు తప్ప ఒరు లెవ్వరు నెఱుఁగరే, ఎట్లు?

కంకరు:—విభూతీ! మమ్ములగూడ నీ వనుమానించెదవా!

విభూతి:—అనుమానమునకు మేర లేదు.

కంకర:—అయిన, మేముగూడ నీపై ననుమానపడెదము.

విభూతి:—అందులకు మీ కధికారమున్నది! కాని సమయము వచ్చినపు డన్నియు పరిష్కరింపబడును.

రణ:—(వార్తావహునితో) వా రెందులకు వచ్చుచున్నారో నీ వెఱుఁగుదువా?

వార్తా:—యువరాజు ఖయిదులో నున్నాఁడని విని, వా రాయనను వెదకి విముక్తునిగావింప వచ్చుచున్నారు.

విభూతి:—వారివలెనే మేమును ఆతని వెదకుచున్నాము. ఎవ రాతని కనుగొనగలరో చూతము!

ధనం:—ఉభయులును ఆతని కనుగొనఁగలరు. ఆతనికి ప్రియు లెవ్వరును లేరు.

వార్తా:—శివతార ప్రజానాయకుఁడు గణేశుఁ డడిగో వచ్చుచున్నాఁడు.

[గణేశుఁడు ప్రవేశము]

గణే:—(ధనంజయునితో) తండ్రీ! ఆతని మేము కనుగొందుమా?

ధనం:—ఆఁ

గణే:—మాకు వార్గానమునుగావింపుము!

ధనం:—తప్పక మీరాతని కనుగొందురు.

రణ:—మీ రెవరికొఱకు వెదకుచున్నారు?

గణే:—రాజా! నీ వాయనను విడచి వేయవలెను.

రణ:—ఎవరిని?

గణే:—మా యువరాజును! ఆయన మీకక్కఱలేదు. మాకు కావలెను! మాకు ప్రాణాధారములైన వాని నన్నిఁటిని—ఆయననుగూడ—నీవు బంధించెదవా?

ధనం:—తెలివిహీనుఁడా! ఆయనను బంధించుటకు సామర్థ్యమెవరికి గలదు?

గణే:—మే మాయనను రాజుగ చేసికొందుము.

ధనం:—సరే, తప్పక చేసి కొనుఁడు. రాజ కిరీటముతో నా తఁడు వచ్చుచున్నాఁడు.

(దైవభక్తులు పాడుచు ప్రవేశము.)

(పాట)

తిమిర హృద్వి దారణ
జ్వల దగ్ని నిదారుణ
మరు శ్మశాన సంచర
శంకర శంకర
వజ్ర ఘోష వాణీ
రుద్ర శూలపాణీ
మృత్యుసింధు సంతర
శంకర శంకర

(బైటనుండి అంబ కంఠము వినఁబడును.)

అంబ:—అమ్మ పిలుచు చున్నది. సుమనా! అమ్మ పిలుచు చున్నది.

మరలిరమ్మా, సుమనా! మరలిరమ్మా!

(దవ్వున నౌక శబ్దము వినఁబడును.)

విభూతి:—విన్నాఁడు! అది యేమి? ఆధ్వని యేమి?

ధనం:—తిమిర హృదయము నుండి యుబుకు చున్న నవ్వు అది.

విభూతి:—ఊరకుండుఁడు! ఏ దిశనుండి ధ్వని వచ్చు చున్నదో గమనించెద.

(దూరమునుండి సన్నముగా వినఁబడును.)

జయము! భైరవునకు జయము!

విభూతి:—(మోము భూమివైపువంచి వినుచు) అది నీటిధ్వని.

ధనం:—నృత్యమందు మృదంగముపై ప్రథమ తాడనము.

విభూతి:—ధ్వని అంతకంతకు హెచ్చుచున్నదే!

కంఠరు:—నాకు తోఁచినది—

నరసింగు:—అవును! నాకును తోఁచుచున్నది.

విభూతి:—దైవమా! ఇంక ననుమానము లేదు. ముక్తధారాజలము విముక్తమైనది!—ఎవరట్లు చేసిరి? —కట్టను ఎవరు తెగ గొట్టిరి? వాఁడుతప్పక శిక్షితుఁడు! దీని తప్పించుకొన లేఁడు!

(త్వరితముగఁ బోవును.)

(అతని వెంబడి కంఠరుఁడు నరసింగుఁడు త్వరితముగ బోదురు)

రణ:—మంత్రీ! ఏమియిది!

ధనం:—బంధ విమోచనకొఱకు చేయు విందుపిలుపు—

(పాడును.)

ద్విపద: అదె మృదంగ నినాదమూల కింపగను
హృదయపు మోత్రితతో నెసఁగి మ్రోగెడును!

మంత్రి:—అయ్యా ఇది—

రణ:—అవును, ఇది వానిపనియే!

మంత్రి:—ఇంకెవరిదియును గాదీపని; ఇది యాతనిదే.

రణ:—ఆతనంతటి ధైర్యశాలి యెవఁడు?

ధనం:—(పాడును)

ద్విపద॥ శ్రీదు మంజీరముల్ చెలఁగి మ్రోగంగ
నాదు జీవితమందు నాట్యమాడెదును.

రణ:—నే శిక్షించెదను; ఆతడు శిక్షార్హుఁడయినయెడల కాని, ఈ జనులు కోపముచే నొడలెఱుంగక,—అయ్యో, నా అభిజిత్తు! దేవతలచే కటాక్షింపఁ బడినవాఁడు! దేవతలాతని రక్షించెదరుగాక.

గణే:—ఏమి జరిగినదో నే గ్రహింపకున్నాను, ప్రభూ!

ధనం:—(పాడును)

ద్వా॥ కాచుచుండును రేయి కడుశ్రద్ధతోడ
కాచు వానికి గూడ కావలియుండు;

మిను మిన్కుమని మింట మెరయు తారలును
ఘనభీతి చేతను గడగడ వడకు.

రణ:—అదిగో; అడుగుల చప్పుడు వినవచ్చుచున్నది! అభి జిత్తూ! అభిజిత్తూ!

మంత్రి:—ఆ వచ్చుచున్నవాఁ డతఁడే కావచ్చు.

ధనం:—(పాడును)

ద్విపద॥ పగులు గుండెలు నావి వ్రిక్క వ్రిక్కలుగ
తగ సంకెలలు వీడి ధరణిపైఁ బడగ

(సంజయుఁడు ప్రవేశము)

రణ:—అదే సంజయుఁడు వచ్చుచున్నాఁడు! అభిజి త్తెక్కడ?

సంజ:—ముక్తధారా జలపాత మతని తీసికొనిపోయినది. మన కాతఁడు లేఁడు.

రణ:—ఏమనెదవు, కుమారా?

సంజ:—కట్ట నాతఁడు తెగఁగొట్టెను.

రణ:—ఆఁ నాకుఁదెలిసె! అందుమూలమున నాతఁడు స్వేచ్ఛ గనెను. సంజయా! ఆతఁడు వెంబడి నిన్ను తీసికొనిపోయెనా?

సంజ:—లేదు! కాని, అతఁ డచ్చటకు పోవునని నే నిశ్చయముగ నెఱుఁగుదును. కాని అందుచే నే నాతనికి ముందుగ పోయి చీఁకటిలో వేచియుంటిని—అంతియే. నన్ను రానీయక వెనుక నుంచివేసెను.

రణ:—తరువాత, తరువాత! విపులముగాఁ జెప్పుము.

సంజ:—యంత్రనిర్మాణమున నొకచోట బలహీనముగ నున్న దని ఆతఁ డెటులనో తెలిసికొనెను; అచ్చటనే యంత్ర పిశాచము నాతఁడు కొట్టెను. ఆపిశాచము తిరిగి యాతని నేసెను. అప్పుఁ డాతని హతశరీరమును ముక్తధార, తల్లి యుంబోలె చేతుల పొదివిబట్టి తీసికొనిపోయెను.

గణే:—మా యువరాజుకొరకు వెదుక వచ్చితిమి. మా కీఁక నాతఁడు కనఁబడఁడా?

ధనం:—కనుగొంటిరి గదా, శాశ్వతముగ మీ రాతని నేఁడు!

[భిక్షువు పాడుచు ప్రవేశము.]

జయ భైరవ జయశంకర
జయ జయ జయ ప్రళయంకర
శంకర శంకర.

జయ సంశయ భేదన
జయ బంధన ఛేదన
జయ సంకట సంహార
శంకర శంకర.

తిమిర హృద్విదారణ
జ్వలదగ్ని నిదారుణ

మరు శ్మశాన సంచర
శంకర శంకర.
వజ్రి ఘోషవాణీ
రుద్ర శూల పాణీ
మృత్యు సింధు సంతర
శంకర శంకర.

స మా ప్త ము.